ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 15, సెప్టెంబరు 2025



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న హర్షవర్ధన్‌రాజు

నేర రహిత జిల్లానే ధ్యేయం

- మహిళలకు రక్షణ.. శాంతి భద్రతల పరిరక్షణ
- సైబర్ నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ విషయంలో రాజీ పడేది లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికడుతూ జిల్లాను నేర రహితంగా మార్చడంలో తనదైన పాత్ర పోషిస్తానన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి వారికి పోలీసులను చేరువ చేస్తానన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి అధికారుల నుంచి సిబ్బంది వరకూ బాధ్యతాయుతంగా వ్యవహరించేలా కృషి చేస్తానని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగుతానని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణకు చర్యలు తీసుకుంటానన్నారు. మహిళల భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కల్పించి ప్రతి మహిళ దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఆపద సమయాల్లో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు. నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రకాశం పంతులు పేరుతో ఉన్న ఈ జిల్లాలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎస్పీ చెప్పారు. జిల్లాకు మంచి పేరు, ప్రత్యేక గౌరవం ఉందని.. దానికి మరింత విలువ తెచ్చేలా కృషి చేస్తానని హర్షవర్ధన్‌రాజు తెలిపారు. తొలుత ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులలర్పించారు.





ఆత్మీయ వీడ్కోలు

ఇతర జిల్లాలకు బదిలీ అయిన కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌కు ఆత్మీయ వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక రిమ్స్‌లోని ఆడిటోరియంలో కలెక్టర్‌కు, పోలీసు శాఖ తరపున పరేడ్ గ్రౌండ్స్‌లో ఎస్పీకి వేర్వేరుగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా అన్సారియా మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. దామోదర్ మాట్లాడుతూ తాను సమర్థవంతంగా పనిచేసేందుకు సహకారం అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

7

నిధులున్నా నిర్లక్ష్యమే!

రెండేళ్లుగా ఆగిన ట్రై సైకిళ్ల తయారీ

- ఒంగోలులో మూతపడిన టీసీపీ సెంటర్
- మధ్యలోనే ముఖం చాటేసిన టెండర్‌దారుడు
- అధికారుల నిర్లక్ష్యంతో దివ్యాంగుల పాట్లు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్టుంది దివ్యాంగుల దుస్థితి. వారికి ట్రైసైకిళ్ల తయారీకి అవసమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసినా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దివ్యాంగుల కార్పొరేషన్, విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ బాధ్యులు పట్టించుకోకపోవడంతో దివ్యాంగులు లబోదిబోమంటున్నారు. ఐదేళ్లుగా నిరీక్షణ తప్పడంలేదని వాపోతున్నారు. మొత్తం 1,465 ట్రైసైకిళ్లు తయారు చేసి ఆరు జిల్లాల్లోని లబ్ధిదారులకు అందించాల్సి ఉండగా కేవలం 765 మాత్రమే తయారు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.



ఒంగోలులో మూసివేసి ఉన్న టీసీపీ సెంటర్

ఒంగోలు నగరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. 1,465 ట్రై సైకిళ్ల తయారీ కోసం రూ.80 లక్షలు విడుదల చేసింది. వీటిని ఒంగోలులోని దివ్యాంగుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రం (టీసీపీసీ)లోని సిబ్బంది తయారు చేసే విధంగా నిర్ణయించింది. నిధులను 2020లోనే దివ్యాంగుల కార్పొరేషన్‌కు ఇచ్చింది. వీటిని కార్పొరేషన్ మేనేజర్, విభిన్నప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జేసీ జాయింట్ అకౌంట్‌తో బ్యాంకులో జమ చేసింది. ఆరు జిల్లాలకు కలిపి ఒంగోలులో ట్రైసైకిళ్లు తయారు చేయాలి. వాటిని బాపట్ల, గుంటూరు, పల్నాడు, కృష్ణ ఎన్టీఆర్, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లోని దివ్యాంగులకు సరఫరా చేయాల్సి ఉంది. నిధులు విడుదలై ఐదేళ్లవుతున్నా మొత్తం 1,465 ట్రై సైకిళ్లలో 765 మాత్రమే తయారు చేశారు.

చేతులెత్తేసిన టెండర్‌దారుడు

ప్రభుత్వం విడుదల చేసిన రూ.80 లక్షలతో 1,465 ట్రై సైకిళ్ల తయారీకి మెటీరియల్ సరఫరా చేసే బాధ్యతను సికింద్రాబాద్‌కు చెందిన మయూర్ అసోసియేట్స్ దక్కించుకుంది. కొంతమేర మెటీరియల్ సరఫరా చేసి ఇక తమ వల్లకాదంటూ అసోసియేట్స్ ప్రతినిధులు చేతులెత్తేశారు. ఇది జరిగి రెండేళ్లవుతోంది. అయితే మళ్లీ టెండర్ పిలిచి తయారీ పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అటువంటి ప్రయత్నం జరగనేలేదు. దీంతో ఇప్పటి వరకు స్థానిక ప్రగతిభవన్‌లోని టీసీపీ కేంద్రంలో ట్రైసైకిళ్ల తయారీ తిరిగి ప్రారంభం కాలేదు. దీంతో ఆరు జిల్లాల్లో వేలాది మంది దివ్యాంగులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో ట్రై సైకిళ్ల కోసం అర్జీలు సమర్పిస్తున్నారు.

ఈ -టెండర్లకు ఆదేశాలు

ఇప్పటివరకు విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన అర్చన ఇటీవల బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సువార్త బాధ్యతలు చేపట్టారు. టీసీపీసీ సెంటర్‌లో ట్రై సైకిళ్ల తయారీ నిలిచిపోయిన విషయం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ దృష్టికి కూడా వెళ్లింది. దీంతో మెటీరియల్ సరఫరా కోసం కొత్తగా ఈ టెండర్లు పిలవాలని ఆదేశించారు.



తయారీని త్వరలోనే ప్రారంభిస్తాం

- సువార్త, ఏడీ, విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ

టీసీపీసీలో వీలైనంత త్వరగా ట్రైసైకిళ్ల తయారీని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. నిధులు సిద్ధంగా ఉన్నాయి. మెటీరియల్ సరఫరా కోసం తిరిగి ఈ-టెండర్లు పిలవాలని ఆదేశాలు ఉన్నాయి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.



వారి నిర్లక్ష్యం మాకు శాపంగా మారింది

- షేక్ కాలేషా, నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు

ప్రభుత్వం ట్రై సైకిళ్ల తయారీ కోసం తగినన్ని నిధులు విడుదల చేసింది. సకాలంలో వాటిని ఖర్చు చేసి దివ్యాంగులకు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో మెటీరియల్ సరఫరా చేసేందుకు టెండర్ దక్కించుకున్న వారితో అధికారులు కుమ్మక్కయి కొంతకాలం జాప్యం చేశారు. కొత్తగా టెండర్లు పిలవకుండా కావాలనే కాలయాపన చేస్తున్నారు. ఈ కారణంగా వేలాది మంది ట్రై సైకిళ్లు అందక ఇబ్బందులు పడుతున్నారు.

సీఐ సమీముల్లా సస్పెన్షన్

7

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ సోమవారం కూడా యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి అర్జీ స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

నెరవేరిన కల



డీఎస్సీ ఎంపిక జాబితాలకు ఆమోదముద్ర

ప్రకటించిన పోస్టులు 672.. భర్తీ చేసినవి 661

మిగిలినవి 11... నేడు ఫలితాలు

ఒంగోలు విద్య సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీచర్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న వారి కల నెరవేరింది. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాకు డీఎస్సీ కమిటీ ఆమోద ముద్ర వేసింది. సోమవారం ఫలితాలు వెలువడనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, గిరిజన సంక్షేమ గురుకుల, చెంచు పాఠశాలల్లోని 672 ఖాళీ టీచర్ పోస్టుల భర్తీని డీఎస్సీలో ప్రకటించారు. వీటిలో 661 భర్తీ అయ్యాయి. 11 మిగిలిపోయినట్లు తెలిసింది.

పాఠశాలల యాజమాన్యాల వారీగా వివరాలు

ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ యాజమాన్యాల్లోని అన్ని సబ్జెక్టులు, కేడర్ పోస్టులు 599 ప్రకటించారు. వీటిలో ప్రథమ భాష స్కూల్ అసిస్టెంట్ తెలుగు 36, ఉర్దూ 2, హిందీ 23, ఇంగ్లీషు 94, గణితం 92, ఫిజికల్ సైన్స్ (పీఎస్) 24, బయోలాజికల్ సైన్స్ 70, సోషల్ 106, వ్యాయామ విద్య 72, సెకండరీ గ్రేడ్ టీచర్ తెలుగు 72, ఉర్దూ 8 ఉన్నాయి. 593 పోస్టులు భర్తీ కాగా ఆరు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో మిగిలిపోయాయి. మునిసిపాలిటీల్లో 30 పోస్టులను ప్రకటించారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 1, ఇంగ్లీషు 1, గణితం 2, సెకండరీ గ్రేడ్ పోస్టులు 26 ఉన్నాయి. ఈ పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, చెంచు పాఠశాలలకు 43 పోస్టులు ప్రకటించారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 2, హిందీ 4, ఇంగ్లీషు 4, గణితం 1, ఫిజికల్ సైన్స్ 2, బయోలాజికల్ సైన్స్ 2, సోషల్ 2, సెకండరీ గ్రేడ్ టీచర్లు గిరిజన పాఠశాలలకు 17, చెంచు పాఠశాలలకు 9 ఉన్నాయి. 43 పోస్టులకు 38 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో ప్రకటించిన 672 పోస్టులకు సంబంధించి ఎంపికైన 661 పోస్టుల జాబితాకు డీఎస్సీ కమిటీ ఛైర్మన్ అయిన కలెక్టర్, వైస్ ఛైర్మన్ అయిన జాయింట్ కలెక్టర్, మెంబరు కన్వీనర్ డీఈవో, జిల్లా పరిషత్ సీఈవో, మునిసిపల్ ఆర్‌డీలతో కూడిన కమిటీ ఆమోదం తెలిపింది.

భర్తీ కాని 11 పోస్టులు

డీఎస్సీలో జిల్లాలో 11 పోస్టులు భర్తీ కాలేదు. ఎస్సీ రిజర్వేషన్‌లో గ్రూపు-1కు కేటాయించిన 10 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో అవి మిగిలిపోయాయి. ఎస్‌జీటీ ఉర్దూలో బీసీ-డీ రిజర్వేషన్ అభ్యర్థి లేకపోవడంతో ఆ పోస్టుతో కలిపి మొత్తం 11 పోస్టులు భర్తీ కాలేదు. మెగా డీఎస్సీ ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. యాజమాన్యాలు, పోస్టుల వారీగా ఎంపిక జాబితాలను ప్రకటిస్తారు. వీటిని ఒంగోలు విద్యాశాఖ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంతోపాటు డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

22నుంచి కొత్త టీచర్లకు శిక్షణ

డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారికి ఈనెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నియామక పత్రాలు అందజేయనున్నారు. వీరికి 22 నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. ఇది వారం రోజులు ఉంటుంది. చివరి రోజున వీరికి పాఠశాలలు కేటాయించి నియామక ఉత్తర్వులు ఇస్తారు.

నూతన అధికారులకు దిశానిర్దేశం

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

- రెండో రోజు సాయంత్రం శాంతిభద్రతలపై చర్చ
- హాజరు కానున్న కొత్త కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో పాలనా యంత్రాంగాన్ని నడపడంలో.. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడంలో అత్యంత కీలకమైన కలెక్టర్ల సదస్సును సోమ, మంగళవారాల్లో ప్రభుత్వం నిర్వహిస్తోంది. ప్రాధాన్యతలు, వాటి లక్ష్యాల పూర్తికి ఎలా పనిచేయాలన్న దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. కలెక్టర్లు, ఎస్పీలతో ముఖాముఖి మాట్లాడతారు. మూడు, నాలుగు మాసాలకు ఒకసారి ఈతరహా సమావేశాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. తాజాగా రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసిన నేపథ్యంలో కొత్తగా ఆయా జిల్లాలకు నియమితులైన అధికారులకు ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. గతంలో ఇలాంటి సమావేశాలలో జిల్లాలో పరిస్థితులు, ప్రాధాన్యత అంశాలు, ప్రజల సమస్యలపై నేరుగా కలెక్టర్లు కూడా మాట్లాడేవారు. అయితే ఈసారి ఎక్కువ జిల్లాల్లో కొత్త అధికారుల నియామకం జరిగిన నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో వారు ఆయా అంశాలపై అవగాహనకు రావడం కష్టం. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈసారి కీలక రంగాల వారీ రాష్ట్రస్థాయిలోని ముఖ్యకార్యదర్శుల సమావేశంలో వివరించేలా అజెండా రూపొందించింది. ఆ సందర్భంగా ఆయా అంశాలపై ఏదైనా జిల్లాలో కీలక నిర్ణయం తీసుకోవాల్సి వస్తే ప్రత్యేకంగా అక్కడి కలెక్టర్‌కు సూచనలు చేయడం లేదా వారి నుంచి వివరణ తీసుకోవచ్చని సమాచారం. అందుకోసమే గతంలో సాధారణంగా జిల్లాల వారీ అడిగే నివేదికలను ఈసారి తీసుకోవడం లేదని తెలిసింది. తొలిరోజు స్థూల ఉత్పత్తి, సూపర్ సిక్స్, సంక్షేమం, పీ4, లాజిస్టిక్స్ అన్న క్యాంటీన్లు వంటి అంశాలపైన, రెండో రోజున విద్య, వైద్యం, స్కిల్ డెవలప్‌మెంట్, మానవవనరుల అభివృద్ధి ఇతరత్రా రంగాలపై సమీక్ష చేయనున్నారు. సాయంత్రం శాంతిభద్రతలపై సమీక్ష చేసేలా అజెండా రూపొందించారు. ఈసదస్సులో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామితోపాటు కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పాల్గొంటారు.



నిత్య చైతన్య దీప్తి.. విశ్వేశ్వరయ్య స్ఫూర్తి..

- ఆయన పూర్వీకులది బేస్తవారపేట మండలం మోక్షగుండం
- ఎన్నో ప్రాజెక్టులు, పథకాలు, కట్టడాలు ఆయన నిర్మించినవే
- ఆ సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఏటా సెప్టెంబరు 15 ఇంజనీర్ దినోత్సవం నిర్వహణ

7

ఎన్నో ఏళ్లుగా మెలిక.. ఎప్పటికో తీగలేరు కదలిక

7

- వైసీపీ హయాంలో నిధులు నిల్
- ఈ ప్రభుత్వమైనా రైతుల ఆశలు తీర్చేనా?

అనారోగ్య బాధిత కుటుంబానికి సాయం



చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెం గ్రామానికి చెందిన నిడమలూరి చెంచునాగులు అనారోగ్యం కారణంగా మరణించడంతో సీఎంఆర్ఎఫ్ సాయం కింద మంజూరైన రూ. 35,500 చెక్‌ను చెంచునాగులు కొడుకు చక్రధర్‌కు మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు మక్కెన వెంకటరావు, టీడీపీ జమ్మలపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు రావిపాటి కృష్ణ పాల్గొన్నారు.

మంత్రికి పలు వినతులు

క్యాంపు కార్యాలయం వద్ద పలు గ్రామాల ప్రజలు మంత్రిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని, సీఎంఆర్ఎఫ్ సాయానికి సిఫారసు చేయాలని వినతిపత్రాలు అందజేశారు.

సరళీకరణ విధానాలతో అసమానతలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు



మాట్లాడుతున్న బాబూరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ విధానాల వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు ఆరోపించారు. ఆదివారం ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో పార్టీ నగర కార్యకర్తల సమావేశానికి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పట్టణాల్లో బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు రియల్ ఎస్టేట్, నిర్మాణరంగాలను లాభార్జనగా మార్చుకున్నాయని ఆరోపించారు. దీంతో సామాన్యులకు గృహవసతి దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో 3 లక్షల జనాభా, 75 వేల కుటుంబాలు ఉన్నా ప్రజల సమస్యలను పట్టించుకునేవారు లేరన్నారు. ఇళ్ళస్థలాలు, పట్టాలు, టిడ్కో ఇళ్ళు ఇప్పటికి అందని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తాగునీటి సమస్య పరిష్కారం హామీగానే మిగిలిందన్నారు. నగరంలోని 83 సెంట్ల మార్కెట్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసులు, వీరస్వామి, ఆదిలక్ష్మి, బీవీ.రావు, కె.శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, ఏవీ.పుల్లారావు, భక్తసింగ్‌రాజు, మునలారెడ్డి, పీవీఆర్.సుబ్బారావు, జి.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువపై శిథిలమైన బ్రిడ్జి

- వాహనదారుల ఆందోళన

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కొప్పోలు-కరవది రోడ్డులోని గుత్తికొండవారిపాలెం వద్ద డంపింగ్ యార్డు దగ్గర గల సాగర్ కాలువపై గల వంతెన పూర్తిగా శిథిలమైంది. దీంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని కరవది, ఉలిచి, చేజర్ల, దేవరంపాడు, పాతపాడు, గుండాయపాలెం, బీవీపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఒంగోలు నగరం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ఒంగోలు నుంచి చెత్తను వాహనాల ద్వారా గుత్తికొండవారిపాలెం దగ్గర గల డంపింగ్ యార్డుకు సాగర్ కాలువపై గల వంతెన పై నుంచే ప్రయాణిస్తుంటాయి. వంతెనపై సైడు గోడలు లేక పోవటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు వాహనాలు కాలువలోకి పల్టీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వంతెనను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వమే మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి



మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వ నిధులతో తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. రాయవరం మెడికల్ కాలేజీని ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలోని ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి ప్రాంతాల్లోని పేద, దళిత, గిరిజనులకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలంటే మెడికల్ కాలేజీని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య పట్టణ మండల కార్యదర్శులు డీకేఎం రఫి, గుమ్మా బాలనాగయ్య, పి.రూబెన్, ఎస్‌కె నన్నేసా, మహబూబ్‌బాష, సురేష్‌కుమార్, నబీ, రవికుమార్, రాజశేఖర్ రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఐకానిక్ అవార్డు ప్రదానం

పీసీపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య పాన్ ఇండియా ఐకానిక్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. గుంటూరులోని నెస్ట్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం టీచర్స్ హబ్ ఇండియా ఆధ్వర్యంలో పాన్ ఇండియా ఐకానిక్ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. గత కొన్నేళ్లుగా సొంత నిధులతో పాటు దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు ఉత్తమ బోధన, యోగా నేర్పిస్తూ రమణయ్య చేస్తున్న సేవలను టీచర్స్ హబ్ ఇండియా గుర్తించింది. అందుకుగాను పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డు-2025కు రమణయ్యను ఎంపికచేశారు. ఈ అవార్డును ఇస్రో శాస్త్రవేత్త చందు శ్రీనివాస్, టీచర్స్ హబ్ ఇండియా ఆర్గనైజర్ అనిల్‌కుమార్ చేతుల మీదుగా రమణయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా రమణయ్యను ఎంఈవోలు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలువలు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



చంద్రపాలెంలో పిచ్చిమొక్కలతో నిండిన మురుగు కాలువలు



సంతనూతలపాడులోని మద్దులూరురోడ్డులో మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన కాలువ

సంతనూతలపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతనూతలపాడు, చంద్రపాలెం, గంగవరం గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు కాలువల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడం, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి మురుగు పారుదల నిలిచిపోయింది. దీంతో దోమల ఉధృతి ఎక్కువై ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా పారిశుధ్యం కోసం ప్రభుత్వం నిధులు ఇస్తున్నా పరిస్థితి గాడిలో పడటం లేదు. గంగవరం, చంద్రపాలెం గ్రామాల్లో నెలల తరబడి మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో అక్కడ అసలు కాలువ ఉందా అనేంతగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. సంతనూతలపాడులోని పలు చోట్ల డ్రైనేజీ కాలువల్లో ఏకంగా తాగేసి పడేసిన మందుబాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఈవిధంగా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉండటంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం నెలకొంది. సీపీడబ్ల్యుఎస్ స్కీం ద్వారా సరఫరా అవుతున్న గ్రామాల్లోని నీరు విపరీతమైన వాసన వస్తోందని, ఆ నీటిని తాగితే రోగాల బారిన పడతామేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చంద్రపాలెంలో సరఫరా అవుతున్న నీరు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలని, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించడంతో పాటు దోమల ఉధృతి పెరగకుండా ఫాగింగ్ చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఊరూరూ వెళ్లి..ఇంటింటికీ తిరిగి..!

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ● మరో మూడు రోజుల్లో 394 మందికి రూ.2.24 కోట్లు అందజేయనున్న ఎమ్మెల్యే బీఎన్



చీమకుర్తిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) లబ్ధి పంపిణీలో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. ఈ పథకం లబ్ధి పొందిన వారి ఇళ్లకు నేరుగా వెళ్లి చెక్కులను అందజేస్తున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ ఒకేసారి భారీగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిని నియోజకవర్గానికి సాధించారు. పలు గ్రామాలకు చెందిన 394 మంది లబ్ధిదారులకు రూ. 2.24కోట్లు సీఎంఆర్ఎఫ్ కింద తాజాగా మంజూరయ్యాయి. సుమారు 70గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఈనెల 14నుంచి 17వతేదీ వరకు వారి గ్రామాలకు వెళ్లే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం చీమకుర్తి పట్టణంలోని పలు కాలనీలకు చెందిన21 మందికి చెక్కులను అందించారు. సోమవారం మద్దిపాడు మండలంలోని 21 గ్రామాలకు చెందిన 85మంది లబ్ధిదారులకు రూ. 59.54లక్షలు, మంగళవారం ఎన్‌జీపాడు మండలంలోని 22 గ్రామాలకు చెందిన 117మందికి రూ.56.26 లక్షలు అందించనున్నారు. అనంతరం సంతనూతలపాడు, చీమకుర్తి రూరల్ గ్రామాల్లో పంపిణీ చేస్తారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి వరకు ఆయా గ్రామాల్లో పర్యటించి అందజేసేలా షెడ్యూల్ రూపొందించారు. కాగా సీఎం సహాయం ప్రత్యక్షంగా లబ్ధిదారుని అందించి వారి సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందని, అందుకోసం ఈ తరహా కార్యక్రమం చేపట్టినట్లు బీఎన్ తెలిపారు.

సంతనూతలపాడు: పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం, క్రిస్టియన్‌పాలెం, వడ్డెరపాలెంలో ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ఆదివారం సీఎం సహాయనిధికింద 27మందికి రూ.13లక్షల52వేలను చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, రావులపల్లి వెంకటసురేష్‌బాబు, ఆరికట్ల సుమతి, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, వివరం గోవిందు, కరిచేటి శ్రీను, మహేష్, ఎస్.చైతన్య, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, అమానుల్లా పాల్గొన్నారు.

చీమకుర్తి: ఎమ్మెల్యే బీఎన్ ఆదివారం చీమకుర్తి పట్టణంలో సూర్యానగర్, దిన్నేపురం, ఏకలవ్యనగర్‌లకు చెందిన 21మంది లబ్ధిదారులకు రూ.15.58లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, సొసైటీ చైర్మన్ పూనాటి వెంకట్రావు, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, యడ్లపల్లి సురేష్, జనసేన పార్టీ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

రజక వృత్తిదారులపై దాడులను నివారించాలి

- జిల్లా కార్యదర్శి మాలకొండయ్య డిమాండ్



చాకలి ఐలమ్మ చిత్రం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రజక వృత్తిదారులపై జరిగే దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు సామాజిక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం భూమికోసం, భుక్తికోసం, విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ అమరులైన చిట్యాల ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాలకొండయ్య మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీని ఎదిరించి పోరాడిన వ్యక్తి ఐలమ్మ అన్నారు. ప్రజల మేలు కోసం చేసే పోరాటాలు ఎప్పటికి ప్రజల్లో నిలిచిపోతాయన్నారు. వారి పోరాటాల స్ఫూర్తితో రజకులందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు టంగుటూరి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆవుల మంద రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, చందలూరు శ్రీనివాసులు, మంచికలపాటి శ్రీనివాసులు, యోగమ్మ, కె.శ్రీనివాసులు, బొప్పరాజు హరిబాబు, రాయల్ల కాశయ్య, గోపాల్ రఘుబాబు పాల్గొన్నారు.

మై టీడీపీ యాప్ నమోదుపై అవగాహన



యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న హరిబాబు

సంతనూతలపాడు, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో మై టీడీపీ యాప్ నమోదుపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల కోసం పలు యాప్‌లు ఉన్నాయని, ప్రస్తుతం వాటన్నిటీని తొలగించి మై టీడీపీ యాప్‌ను రూపొందించారని తెలిపారు. దీని ద్వారా కార్యకర్తలు తమ అమూల్యమైన ఆలోచనలను తెలియజేయవచ్చని చెప్పారు. ఈ యాప్ ద్వారా ఒక కుటుంబానికి సంబంధించి డివిజన్, క్లస్టర్ వివరాలు తెలుసుకోవచ్చని, అర్హుత గల ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు ఉంటాయన్నారు. మై టీడీపీ యాప్‌తో పార్టీతో పాటు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, తెలుగుయువత అధ్యక్షుడు ముప్పరాజుశ్రీను, మండల ఉపాధ్యక్షుడు మల్లవరపు రామక్రిష్ణరెడ్డి, బి.శంకర్, టి.శ్రీను, ఎస్.శ్రీరామ్మూర్తి, సుబ్బారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఒంగోలు-కరవది రైల్వే స్టేషన్ల మధ్యన ఆదివారం జరిగింది. సుమారు 35 ఏళ్ల వయస్సు గల మహిళ రైలులో నుంచి జారిపడి మృతి చెందింది. నిండు పచ్చ రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. కుడిభుజం పైన, ఎడమ చేతి మణికట్టుపై భాగాన పుట్టుమచ్చలు ఉన్నట్లు రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9440627647 సెల్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కారు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని చిరు వ్యాపారి రాయిని శేషయ్య(54) దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం పేర్నమిట్ట సమీపంలో పొగాకు బోర్డు వద్ద జరిగింది. శేషయ్య సమతానగర్‌లో నివాసం ఉంటూ పేర్నమిట్టలో బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాడు. ఒంగోలు నుంచి మోపెడ్ మీద సరుకులు తీసుకెళుతుండగా కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో శేషయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. ఈమేరకు ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

మద్దిపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచిత శిబిరాల ద్వారా అందించడం అభినందనీయమని ఎంపీపీ వాకా అరుణ పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరులో ఇనమన బాలకోటిరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఒంగోలుకు చెందిన ఉపాస్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, ఎస్అండ్ఎస్ డెంటల్ వైద్యశాల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా 300మందికి పైగా పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. నెలరోజులకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీచేశారు. రోగులుకు ఈహెచ్ఎస్, ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు కల్పిస్తామని ఉపాస్ వైద్యశాల వైద్యులు తెలిపారు. ఈ వైద్యశిబిరం ఇనమన ఫౌండేషన్ వారి సహకారంతో ఇనమల సుధాకరరెడ్డి నేతృత్వంలో జరిగింది. కార్యక్రమంలో ఇనమల బాలకోటిరెడ్డి, ఎంవీ.రామిరెడ్డి(రాంకీ ఫౌండేషన్), బి.బ్రహ్మానందరెడ్డి, పుల్లారెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

18,19 తేదీల్లో యూటీఎఫ్ రణభేరి



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు రణభేరి బైకు జాత కార్యక్రమం ఈనెల 18,19వ తేదీల్లో జిల్లాలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని, కేవలం బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఎలను, ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని కోరారు. పీఆర్సీని వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు, ఎన్.రవి, ఓవీ.వీరారెడ్డి, ఉమామహేశ్వరి, చినస్వామి, సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఇందు మూలముగా యావన్మందికి నా క్లయింట్ సుదీరా ఎంటర్‌ప్రైజస్, ఒంగోలు తరుపున మేదరమెట్ల సుజాత, W/o. సత్యం ఇచ్చిన సంజాయిషీ మేర ఈ నోటీసు ఇవ్వడమైనది.

నా క్లయింట్‌కు సంబంధించిన క్రింది పలుకరింపబడిన Original రిజిస్టర్ దస్తావేజు తేది. 06.09.2025 న ఒంగోలు భాగ్యనగర్ నుండి నా క్లయింట్ నివాసం నుండి ఒంగోలు జిల్లా కోర్టు పోవు మార్గ మధ్యలో ఆటో నుండి Original డాక్యుమెంట్లు జారి పడిపోయినవి. కావున సదరు డాక్యుమెంట్లు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ తెలియచేయగలరు.

డాక్యుమెంటు వివరములు: అద్దంకి సబ్ రిజిస్ట్రేషన్, మద్దిపాడు మండలం, గుళ్ళాపల్లి గ్రామం.

1. తేది. 11.10.1982 Doc. No.5517/82
2. తేది. 21.10.1982 Doc. No. 5676/82
3. తేది. 19.05.1984 Doc. No. 1052/84

ఇట్లు : జి. రామమూర్తి, బి.ఎ.బి.ఎల్
అడ్వకేట్, ఒంగోలు, సెల్: 9948404010

నేటి నుంచి కార్మికుల సమ్మె

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో పారిశుధ్య కార్మికులకు ఈనెల 15వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని కార్మిక మహిళలు ఆదివారం ప్రకటనలో తెలిపారు. గత ఎనిమిది నెలలు తమకు జీతాలు పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు.

కబడ్డీ జూనియర్ జిల్లా క్రీడాకారుల ఎంపిక




జిల్లా జట్లకు ఎంపికైన బాల, బాలికలతో అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర జూనియర్ బాల, బాలికల అంతర జిల్లాల కబడ్డీ పోటీలకు ఆదివారం ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ క్రీడా స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు బాలురకు కొత్తపట్నంలో, బాలికలకు పాకలలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. క్రీడాకారులకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు ఆర్థికసహకారంతో ఉచిత వసతి, భోజనం, క్రీడాదుస్తులను అందజేస్తారన్నారు. క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో ఈ నెల 22నుంచి 25వ తేదీ వరకు జరిగే అంతర జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోషియోషన్ చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, కోశాధికారి డి.రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు రంగారావు, గడ్డం శ్రీనివాసరావు, ఎ.సుమతి, రమణారెడ్డి, దామోర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వంశీ, సిసింద్రీ, వి.బాబు, సమరసింహారెడ్డి పాల్గొన్నారు.












విశ్వేశ్వయ్య ప్రతిభకు మరికొన్ని మచ్చుతునకలు...

- విశ్వేశ్వరయ్య ప్రజ్ఞాఫలంగా నిర్మించిన కృష్ణారాజసాగర్ లక్షలాది ఎకరాల మెట్టభూములు సస్యశ్యామలంగా మారాయి.
- 1921లో భారత ఉత్పత్తిదారుల సమాఖ్యను నెలకొల్పి జీవితాంతం ఆ సమాఖ్య అధ్యక్షుడిగా పనిచేశారు. అవినీతి ఇంజనీర్లను తొలగించి భారతీయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి కర్మాగారాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా చేశారు.
- రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఇండియాలో విమాన నిర్మాణం అత్యవసరమైనది. విశ్వేశ్వరయ్య సలహా మేరకు బెంగళూరులో భారత ప్రభుత్వం విమాన కార్ఖానా, విశాఖపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ప్రారంభించారు.
- అప్పటి ప్రధాని నెహ్రూ ఆహ్వానాన్ని మన్నించి 90ఏళ్ల వయస్సులో విశ్వేశ్వరయ్య పాట్నా వద్ద గంగానదిపై పథకాన్ని రూపొందించారు.
- తుంగభద్ర ప్రాజెక్టు పథక శిల్పి విశ్వేశ్వరయ్యనే.
- తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయానికి వెళ్లేందుకు 1946లో బస్సు మార్గాన్ని రూట్‌మ్యాప్‌తో రూపొందించింది మన విశ్వేశ్వరయ్యే.

నిత్య చైతన్య దీప్తి.. విశ్వేశ్వరయ్య స్ఫూర్తి..



తుంగభద్ర డ్యాం

"ఇంకొద్ది క్షణాల్లో ఈ వంతెన కూలిపోబోతుంది.. రైలు బండిని వెంటనే ఆపండి"... అంటూ బిగ్గరగా కేకలు వేసి ప్రయాణికులందరి ప్రాణాలను కాపాడిన సునిశిత మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య..

"మేమే మాటలతో కాలయాపన చేశాం, మీరు నిరంతర క్రియాశూరులైన నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయులంటూ" 1961 సెప్టెంబర్ 15న బెంగళూరులో జరిగిన విశ్వేశ్వరయ్య జన్మశతాబ్ది వేడుకల్లో అప్పటి ప్రధాని నెహ్రూ చేత ప్రశంసలు పొందిన అపర భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య..! ఈ రెండు సంఘటనలు ఇంజనీర్ విశ్వేశ్వరయ్య బాధ్యతకు, కార్యదక్షతకు కొలమానంగా నిలిచాయి.. గంధపు చెక్కవలే సేవలో అరిగిపో కాని ఇనుము వలే తుప్పుపట్టవద్దు అనేది ఆయన జీవిత ధ్యేయం.

బేస్తవారపేట, సెప్టెంబరు 14 : మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్వీకులు లక్ష్మీపతి బట్టు 16వ శతాబ్దంలో బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామం నుంచి కర్నూలు జిల్లా శ్రీశైలం వెళ్లి అక్కడ పండితుడై కర్నాటక రాష్ట్రంలోని అవతికి వెళ్లారు. దొడ్డబైరే గౌడ వీరి ప్రతిభను గుర్తించి తన ఆస్థానంలో మంత్రిగా నియమించి ముద్దెన హళ్లి, బండేహళ్లి అనే గ్రామాలను దానంగా ఇచ్చారు. వీరి కుమారుడే తిప్ప శాస్త్రి, వీరి కుమారుడే శ్రీనివాసశాస్త్రి, ఆయన కుమారుడే మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

● **చిన్నతనంలోనే తండ్రి మరణించినా...**

మైసూర్‌లోని చిక్క బళ్లాపుర సమీపంలోని ముద్దేనహళ్లిలో స్థిరపడ్డాక అక్కడ 1861న విశ్వేశ్వరయ్య జన్మించాడు. తండ్రి శ్రీనివాసశాస్త్రి, తల్లి వెంకటలక్ష్మమ్మలది సామాన్య కుటుంబం. బాల్యంలోనే విశ్వేశ్వరయ్యకు తండ్రి మరణించాడు. మేనమామ రామయ్య విశ్వేశ్వరయ్యను చేరదీసి బెంగళూరు సెంట్రల్ కాలేజీలో చదివించాడు. మేనమామ ఇంట్లో ఉంటూ కాలేజీ ఫీజుల కోసం ప్రయివేట్ ట్యూషన్ చెబుతూ 1880లో ఎంఏలో ప్రథముడిగా నిలిచారు. గణితంలో ప్రతిభ కలిగిన విశ్వేశ్వరయ్యను మైసూరు రాజ్య దివాన్ రంగయ్య గుర్తించి ప్రభుత్వానికి సిఫార్సు చేసి స్కాలర్‌షిప్ ఇప్పించాడు. ఆ ఉపకారవేతనంతో ఆయన పూణే వెళ్లి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్‌లోనూ ప్రథముడిగా వచ్చారు. దీంతో బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియమించింది. మరుసటి ఏడాది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. కర్తవ్య నిర్వహణలోనూ నిజాయితీతో పనిచేశారు.




మోక్షగుండం గ్రామంలో విశ్వేశ్వరయ్య విగ్రహం

● **నిజాయితీకి నిలువుటద్దం...**

ఒకసారి విశ్వేశ్వరయ్య విదేశీ పర్యటనకు కొంత పైకం అవసరమైంది. మైసూరు బ్యాంక్‌కు వెళ్లి తమ వద్ద ఉన్న భారత ప్రభుత్వ రుణపత్రాలు ఇచ్చి తాకట్టు పెట్టుకొని కొంత నగదు ఇవ్వాలని కోరారు. బ్యాంక్ సిబ్బంది విశ్వేశ్వరయ్య నిజాయితీని మెచ్చుకున్నారు. అలాగే ఆయన దివాన్ పదవిలో ఉండగా ఎటువంటి ఉద్యోగాలు కోరవద్దని తన బంధువులకు గట్టిగా చెప్పారు. అంతేగాక అప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న వారిని విధుల నుంచి తప్పించి ఇతర వృత్తులు చేపట్టేందుకు స్వంత పైకం ఇచ్చి అభివృద్ధికి సహకరించారు.

● **భారతరత్నతో సముచిత స్థానం**

తొంభై ఏళ్ల వయస్సులో కూడా విశ్వేశ్వరయ్య కళ్లద్దాలు లేకుండా చదివేవారు. దేశ విదేశాలలోని విశ్వవిద్యాలయాలు విశ్వేశ్వరయ్యను సత్కరించాయి. 1961లో విశ్వేశ్వరయ్య శతజయంతి ఉత్సవాలకు భారత ప్రధాని నెహ్రూ వచ్చారు. మేము మాటలతో కాలయాపన చేశాం, మీరు నిరంతర క్రియాశూరులై నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడు అంటూ కొనియాడారు. భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు భారతరత్న బిరుదుతో సత్కరించింది. కాలనుగుణంగా ఏప్రిల్ 12వ తేదీ 1962లో విశ్వేశ్వరయ్య దిగవంతులైనారు. అయితే ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 15వ తేదీన ఇంజనీర్స్‌డేగా జరుపుకుంటున్నారు.

విశ్వేశ్వరయ్య ప్రతిభను గుర్తించిన ఆంగ్లేయులు

ఆంగ్లపాలకులు విశ్వేశ్వరయ్య కార్యదక్షత, ప్రతిభను గుర్తించి ప్రపంచ జలాశయాల్లో ఒక్కటైన సుక్కూర్‌బరాజ్ నిర్మాణానికి ఇంజనీర్‌గా నియమించారు. దీంతో సింధూనది నీరు సుద్నేరుకు చేరేలా చేశాడు. ఆ నదినీరు వడగట్టడానికి ఒక వినూత్న విధానాన్ని రూపొందించారు. దాహరి దగ్గర నంబనది మీద సైఫన్ పద్ధతిన కట్ట నిర్మించారు. అక్కడ విశ్వేశ్వరయ్య తన మేధాశక్తితో దానికి ఆటోమేటిక్ గేట్లు నిర్మించి సమస్య తొలగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 1906లో ఏడెన్ నగరం నీటి సరఫరా ప్రణాళికను రూపొందించారు. దీంతో అప్పటి ప్రభుత్వం విశ్వేశ్వరయ్యను సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా నియమించింది. అప్పట్లోనే కొల్హాపూర్, ధార్వాడ, బిజాపూర్ తదితర పట్టణాల్లో మంచినీటి పథకాలను ఏర్పాటు చేయించారు. ఆయన ఆధ్వర్యంలోనే హుసేన్‌సాగర్, హైదరాబాద్ నగరాలకు విస్తృత సేవలు అందాయి. మైసూర్ సంస్థానాన్ని ఆదర్శ సంస్థానంగా తీర్చిదిద్దాలని 1909లో మైసూర్ ప్రభుత్వం ఆయనను చీఫ్ ఇంజనీర్‌గా నియమించింది. హెబ్బాళ్ వ్యవసాయశాఖ కళాశాల, మైసూర్ విశ్వవిద్యాలయం, ఛాంబర్ ఆఫ్ కామర్స్, సోప్ ఫ్యాక్టరీ కన్నడ సాహిత్య పరిషత్ వాటిని నెలగొల్పారు.


పట్టుబడిన మద్యాన్ని ఆటోలో తరలిస్తున్న సిబ్బంది

అనధికార మద్యం విక్రయాలపై దాడి

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అనధికారిక మద్యం విక్రయాలపై ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఒంగోలు నగరం కొత్తపట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గతంలో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహించిన చోట అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయాలు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు సమాచారం తెలుసుకున్నారు. అక్కడ నిల్వ ఉంచిన మద్యం పెట్టెలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ అశోక్ తెలిపారు.

రాయవరంలో చోరీ

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయవరం గ్రామం ఎస్సీ కాలనీలో ఓ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరం ఎస్సీ కాలనీలోని చర్చికి జేమ్స్ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు నల్లపూసల దండ 1, రెండు ఉంగరాలు, ఒక దండ, రూ.10వేల నగదు పోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ అంకమరావు, ఏఎస్ఐ రంగయ్య సిబ్బందితో ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

సీఐ సమీముల్లాపై వేటు

ఒంగోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డీటీసీలో సీఐగా పనిచేస్తున్న సమీముల్లాను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఆదేశాలు జారీ చేశారు. సమీముల్లా గత వైసీపీ పాలనలో మాచర్లలో పనిచేసిన సమయంలో పలు కేసుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. వీటిపై విచారణ చేపట్టిన పోలీస్ శాఖ.. సీఐ సమీముల్లా అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించడంతో సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

బదిలీపై వెళ్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులందరి సహకారంతోనే జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేశానని గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రిమ్స్‌లోని ఆడిటోరియంలో అన్సారియాకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ఏడాది జూన్ 27న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తాను విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం ద్వారా జిల్లాలోని పరిస్థితిపై స్పష్టమైన అవగాహన వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్న జిల్లాలో స్వచ్ఛందసంస్థలతో పాటు వివిధ వర్గాల భాగస్వామ్యులను చేయడం ద్వారా బాల్యవివాహాలు, వెట్టిచాకిరీని నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన విషయాన్ని అన్సారియా గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం కంటే కూడా ఉద్యోగులకు ఆయా విషయాలలో అవసరమైన అవగాహన కలిగించి దిశానిర్దేశం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలనేది తన ఆలోచన విధానమన్నారు. జిల్లాలో 14 నెలలకు పైగా కలెక్టర్‌గా పని చేసిన కాలంలో ఇదే విధానాన్ని తాను అనుసరించానని తెలిపారు. జిల్లాలో సీఎం పర్యటనలు విజయవంతంలోనూ, విజయవాడ వరదల సమయంలో జిల్లా నుంచి అవసరమైన ఆహార పదార్థాలను పంపించడంలోనూ ప్రభుత్వ సిబ్బంది, డ్వాక్రా మహిళల పాత్రను అన్సారియా కొనియాడారు. అంతకు ముందు వివిధశాఖల అధికారులు కలెక్టర్ అన్సారియాతో కలిసి పని చేసిన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్సారియా, జేసీ గోపాలకృష్ణ,డీఆర్వో ఓబులేశు

ఎస్పీ దామోదర్‌కు ఘన వీడ్కోలు


ఎస్పీ దామోదర్ ఎక్కిన జీపును లాగుతున్న పోలీస్ అధికారులు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 14 నెలలు ఎస్పీగా పనిచేసి బదిలీపై విజయనగరం జిల్లా వెళుతున్న ఏఆర్ దామోదర్‌కు పోలీసు శాఖ తరఫున ఘనంగా వీడ్కోలు పలికారు. తొలుత వీడ్కోలు పరేడ్ నిర్వహించి ఓపెన్ టాప్ జీప్‌పై ఊరేగించారు. అనంతరం ఎస్పీ దామోదర్‌ను పోలీసు అధికారులు, నగర ప్రజలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో సహకారం అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

దర్శి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అన్నివిధాలా అండగా ఉంటామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఆదివారం స్థానిక శ్రీనివాస పద్మావతి కల్యాణ మండపంలో జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా బొగ్గవరపు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ముప్పవల శ్రీనివాసులు, కోశాధికారిగాఆర్.లక్ష్మీనర్సింహారావుతో పాటు నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్యులను వ్యాపారాలు కూడా చేసుకోనివ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. కొంతమందిని బెదిరించటంతో పాటు అక్రమ కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్యవైశ్యులతో పాటు అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారన్నారు. మంచి ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ సహకారం అందించాలని కోరారు.

టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు తమ సంపాదనలో కొంతభాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ప్రపంచవ్యాప్తంగా వాసవీమాత పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. మాజీ మంత్రి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులను అన్నివర్గాల ప్రజలు ఆదరించి గౌరవిస్తున్నారని చెప్పారు. ఆర్యవైశ్యులు కొంతమంది అమ్మవారి భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి దొంగల ఆటకట్టించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆర్యవైశ్యులపై అక్రమ కేసులు పెట్టి వేధించటంతో వారికి తగిన గుణపాఠం చెప్పామన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్, వైసీపీ నాయకులు దుర్మార్గంగా వ్యవహరించారని, అలాంటి దుష్టులకు ఆర్యవైశ్యులు భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, వాసవీ సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మావతి, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కోటా హనుమంతరావు, సూరె చిన్న సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్, టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి, మాజీ మంత్రులు శిద్దా రాఘవరావు, టీజే వెంకటేష్

ఎన్నో ఏళ్లుగా మెలిక.. ఎప్పటికో కదలిక

నిధులివ్వకుండా జీవోలతో సరిపెట్టిన వైసీపీ

తీగలేరు అభివృద్ధికి ప్రజా ప్రభుత్వమైనా కనికరించాలని రైతుల విజ్ఞప్తి

త్రిపురాంతకం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వెలిగొండ నీరు అందించే తీగలేరు కాలువలో భాగమైన తీగలేరు-5 కాలువ నిర్మాణంపై ఏళ్ల తరబడి స్పష్టత లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండడంతో ప్రాజెక్ట్ నిర్మాణంతో పాటు తీగలేరు-5 కాలువపై కూడా దృష్టి సారించి ప్రణాళిక రూపొందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. తీగలేరు కాలువ ద్వారా దోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని దాదాపు 38 గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఇందులో భాగంగా దాదాపు 65వేల ఎకరాలు సాగులోకి వచ్చేలా రూపకల్పన చేశారు. పుల్లలచెరువు మండలంలో అటవీ భూములను మినహాయించి కాలువ తవ్వేలా సర్వే చేసి నిర్ణయం తీసుకోవడంతో కేవలం 7060 ఎకరాలకు మాత్రమే పుల్లలచెరువు మండలంలో సాగు నీరు అందుతుంది. మొదట రూపొందించిన డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ప్రకారం 11వేల 500 ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. దీనిప్రకారం కాలువ తవ్వకం పనులు చేపట్టి పుల్లలచెరువు గ్రామంలోని చివరిగా ఉన్న చిన్నకండలేరు ప్రాజెక్ట్ (చెరువు)లో నీరు నింపేలా ఎండింగ్ పాయింట్‌గా నిర్ధారించారు. కానీ ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) ప్రతిపాదనలో కేవలం 7వేల ఎకరాలకు మాత్రమే లబ్ధి జరిగేలా రూపొందించారు. విషయాన్ని రైతులు 2014లో అప్పటి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం మళ్లీ సర్వే చేయించి తీగలేరు-5 కాలువను డీపీఆర్ ప్రకారం తవ్వేలా మొత్తం ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేసింది. ఆ తరువాత ఏళ్ల తరబడి ఈ సమస్య అలాగే ఉండిపోయింది.

● **జీవో ఇచ్చి హడావుడి చేసిన గత ప్రభుత్వం**

తీగలేరు-5 కాలువను మేమే సాధించి పూర్తి చేస్తామని గత వైసీపీ హయాంలో నాయకులు ఈ ప్రాంత ప్రజలకు వాగ్దానాలు చేశారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తమైందని, నిధుల విడుదలకు అంగీకారం తెలిపిందని చెప్తూ ఒక జీవో జారీ చేయించారు. ఈ పనుల కోసం పేరును కూడా మార్చి తీగలేరు-5 బదులు చిన్నకండలేరు ప్రాజెక్ట్ కాలువ అని మార్చారు. ఈ పనుల కోసం 2022-23లో అందుకు అవసరమైన రూ.83.78కోట్లకు పరిపాలన అనుమతులు ఇస్తూ జీవో ఆర్టీ నెంబర్ 1824 విడుదల చేశారు. కానీ అది నిధులు లేని జీవో అని తెలుసుకుని మోసపోయామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● **ఈ ప్రభుత్వమైనా కనికరించాలి**

తీగలేరు నిర్మాణం విషయంలో ఈ ప్రభుత్వమైనా రైతులపై కనికరం చూపాలని కోరుతున్నారు. దీనిపై రైతుల్లో అవగాహన తెస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లేలా ఇటీవల మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు పోస్టుకార్డు ఉద్యమం కూడా చేపట్టారు. స్థానిక పాలకపార్టీ నాయకులు ఇక్కడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చిన్నకండలేరు వరకు తీగలేరు కాలువ నిర్మాణం చేపట్టేలా నిధులు విడుదలకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.


తీగలేరు కాలువ చివరిపాయింట్ చిన్నకండలేరు ఐదె

కాలువ స్వరూపం

గ్రామం	డీపీఆర్ ప్రకారం ఆయకట్టు ఎకరాల్లో	ఈపీసీ ప్రకారం ఆయకట్టు ఎకరాల్లో
కొమరోలు	1,366	1,510
చాపలమడుగు	1,484	2,600
మల్లాపాలెం	1,239	150
అయ్యాపురెడ్డిపల్లి	1,171	0
కవలకుంట్ల	1,128	1,300
రాచకొండ	1,572	750
వెంకటరెడ్డిపల్లి	1,216	0
ఉమ్మడివరం	1,070	0
పుల్లలచెరువు	1,254	750

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

డిస్టెన్స్ ఎడ్యుకేషన్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న ALL MA, ALL M.Sc, M.Com, M.S.W, MHRM, MCA & MBA కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. MBA & MCA అర్హత పరీక్ష 21-9-2025 జరుగును. సంప్ర: గీతం డిగ్రీ కాలేజీ, ఒంగోలు సెల్: 98491 24970, 90305 68558.

AJO-241107

CHANGE OF NAME

I, Tirupathamma thammisetty, W/o Challa Venkateswarlu, R/o H.No: 7-16-21/B, Giddaluru-523357, Prakasam Dt. Hence forth is known as Challa Thirupathamma.

AJH-3012

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు, పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥ సర్క్యులేషన్ మేనేజర్ : 9985411484

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇప్పుడు మీ ఆత్మీయులకు, ప్రకటనల ద్వారా మరింత చేరువకండి. వివాహ, షష్టిపూర్తి, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు ఉద్యోగ, వ్యాపార, లీగల్ ప్రకటనలు, శ్రద్ధాంజలి, వర్థంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 95053 05888, 97036 18694, 96525 55752, 99854 11483

చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11071
గిద్దలూరు : 99859 21358

ఎగువ చెర్లోపల్లికి రాకపోకలు బంద్

» అడుగడుగునా గుంతలు
» శిథిలావస్థలో బ్రిడ్జి » ప్రజలకు తిప్పలు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రగతికి రహదారులు అభివృద్ధి మార్గం. అయితే అందుకు భిన్నంగా మండలంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామానికి వెళ్లే రహదారులు గుంతలతో అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు రాకపోకల కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారయింది. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుంచి 7కిలో మీటర్ల దూరంలో నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఏర్పడింది. ఈ గ్రామం నుంచి మరి కొన్ని కిలో మీటర్ల దూరంలో ఇంకా లోతట్టు అటవీ ప్రాంతంలో చిలకచెర్ల గూడెం, బంధం బావి, చెరువుగూడెం ఉన్నాయి. ఎగువ చెర్లోపల్లి గ్రామ సమీపం నుంచే మిగిలిన గ్రామాలకు వెళ్లాలి. ఒకే ప్రధాన రహదారి గుండా నాలుగు గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. ఇదే రహదారి ఎగువ చెర్లోపల్లి ఊరిని కలుపుతూ మధ్యలో తీగలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం దశాబ్దాల కిందట జరిగింది. ప్రస్తుతం అది పూర్తిగా శిథిలమై పోయింది. ఏటా వర్షాకాలంలో బ్రిడ్జి పై నుంచి వరద నీరు ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో నాలుగు గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతాయి. ఈ గ్రామాల్లో చెంచు గిరిజనులు అధిక శాతం మంది ఉంటున్నారు. వారు అటవీ ఉత్పత్తులు సేకరించి పట్టణాల్లో విక్రయించి, వచ్చిన సొమ్ముతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారు. అంతేగాక ఉద్యోగులు, విద్యార్థులు కూడా సమయానికి వెళ్లలేని పరిస్థితులు నెలకొంటాయి. ముఖ్యంగా ఈ గ్రామాలన్నీ వ్యవసాయ ఆధారిత కుటుంబాలు కావడంతో సేద్యానికి కావలసిన ఎరువులు, విత్తనాలు పండించిన పంట ఉత్పత్తులు బయటకు తీసుకురాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై గ్రామాల ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు, పాలకులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి, రహదారిని నిర్మించాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు.


బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)


రహదారిలో అడుగడుగునా గుంతలే


మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వమే మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి

మార్కాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వ నిధులతో తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు డిమాండ్ చేశారు. రాయవరం మెడికల్ కాలేజీని ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలోని ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి ప్రాంతాల్లోని పేద, దళిత, గిరిజనులకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలంటే మెడికల్ కాలేజీని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య పట్టణ మండల కార్యదర్శులు డీకేఎం రఫి, గుమ్మా బాలనాగయ్య, పి.రూబెన్, ఎస్కె నన్నేసా, మహబూబ్‌బాష, సురేష్‌కుమార్, నబీ, రవికుమార్, రాజశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న అనిత

టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా అనిత

బేస్తవారపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా బేస్తవారపేట పట్టణానికి చెందిన సున్నం అనితను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని అనిత, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బేస్తవారపేట మండలం పాపాయిపల్లె గ్రామానికి చెందిన అనిత పార్టీలో చురుగ్గా పాల్గొంటారని, ఆమె సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేశామని తెలిపారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి


బహుమతులతో విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హిందీ భాషపై పట్టు సాధించాలని వాసవీ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ రంగయ్య అన్నారు. వాసవీ విద్యానికేతన్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ.. హిందీ భాష ప్రాముఖ్యతను గుర్తించి, అందరూ నేర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఏవో రంజిత్, హిందీ పండితులు బాబు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్ప మాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్న కేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుం కుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొనాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొనాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వై.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలు నిర్వహించారు. బహుమతులు అందించారు. సోమవారం ఉదయం ఆలయంలో ఉట్టికొట్టే ఉత్సవం, సాయంత్రం భరతనాట్యం పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అధ్యక్షురాలు వరలక్ష్మీ, కార్యదర్శి వెంకటరెడ్డి, కోశాధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

8 నెలలుగా ఏరియా ఆసుపత్రిలో అందని జీతాలు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో పారిశుధ్య కార్మికులకు 8 నెలలు జీతాలు పంపిణీ చేయడం లేదు. ఈనెల 15వ తేది సోమవారం నుంచి సమ్మెకు దిగుతామని కార్మిక మహిళలు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ప్రధాని పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కృష్ణారావు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలను 15 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామని బీజేపీ నాయకులు కృష్ణారావు తెలిపారు. వివేకానంద విద్యాపీఠంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సరోజిని మాట్లాడుతూ.. 15 రోజుల పాటు మోదీ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్‌తో అర్షియా

గిద్దలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని స్ప్రింగ్ బోర్డు పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని షేక్ అర్షియా కరాటే చాంపియన్ షిప్ పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించింది. కర్నూలులో జరిగిన నేషనల్ లెవెల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో అర్షియా గోల్డ్‌మెడల్ సాధించడంతో పాఠశాల ప్రతినిధులు డాక్టర్ జేవీ నారాయణ, శ్వేత, చైతన్య ఒక ప్రకటనలో అభినందించారు.

ఎమ్మెల్యేగారూ సమస్యలను పరిష్కరించండి

» కొమరోలు వాసుల విజ్ఞప్తి
» నేడు మండల సర్వసభ్య సమావేశం


ప్రభుత్వాసుపత్రి దుస్థితి

కొమరోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలతో సమావేశాలు నిర్వహించారే తప్ప సమస్యలను పరిష్కరించలేదు. దీంతో ఈ సమావేశానికి రానున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి సమస్యలు స్వాగతం పలకనున్నాయి. ప్రజా ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హయాంలో మా బాధలు తీరుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు

- మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలన్నది ప్రజల చిరకాల కోరిక. గతంలో కొమరోలు ప్ర భుత్వ వైద్యశాల ఉన్నప్పటి నుంచే ఇక్కడ ఆపరేషన్‌లు, పోస్టుమార్టంలు చేసేవారు. నిష్ణాతులైన వైద్యులు కూడా ఇక్కడ పనిచేసేవారు. అయితే వైసీపీ పాలనలో దానిని 10పడకల పీహెచ్‌సీ కేంద్రంగా తగ్గించారు. 5 కిలో మీటర్ల పరిధిలో 20వేల మంది జనాభా ఉన్న ఆసుపత్రిలను సీహెచ్‌సీలుగా మార్చవచ్చు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో కొమరోలు వైద్యశాలలో మహిళా డాక్టర్‌ను నియమించడంతో ఓపీల సంఖ్య పెరిగింది. స్థానికంగా ఉన్న ఆసుపత్రి సేవలను గుర్తించి 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కొమరోలులో నిలిచిన మినీ స్టేడియం

- గత టీడీపీ హయాంలో మంజూరు చేసి నిర్మాణాలను ప్రారంభించగా చివరిలో వచ్చిన వైసీపీ నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన మినీ స్టేడియం, బీసీ, కాపు భవనాలను పూర్తిచేయించాలి, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలకు అదనపు గదులను నిర్మించాలి, బీసీ, ఎస్సీ హాస్టళ్లను నిర్మించాలి.
- కడప - అమరావతి రాష్ట్రీయ రహదారిలోని పోరుమామిళ్ల నుంచి తాటిచర్ల మోటు వరకు డబుల్ లైన్ రోడ్డు వేయాలి. ఇటీవల ఈ రోడ్డుపై ఉన్న గుంతలను ఎమ్మెల్యే పూడ్చించారు. అయితే రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. కొమరోలు - రాజుపాలెం రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చే యాలి. తాగు నీరు, పారిశుధ్యంపై ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి కొమరోలు పంచాయతీ స్థాయిని పెంచాలని, ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుకు కృషి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

పొదిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను సోమవారం నుంచి వేయనున్నట్లు పశు వైద్య సహాయ సంచాలకులు వేణు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల్లో గేదెలు, ఆవుల యజమానులు ఉచిత టీకాలను వేయించాలని ఆయన కోరారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నోటి నుంచి తీగలవలే సొంగ, చిన్నపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసక పోవడం వంటి లక్షణాలు ఉన్నట్లైతే గాలికుంటు వ్యాధి సోకినట్లు భావించాలన్నారు. పశుపోషకులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


నిత్యావసర సరుకుల అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు యువ ప్రగతి పథం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందచేశారు. విద్యార్థిణీ విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత పగిడి వేణు గోపాల్, ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, ఫరూఖ్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

చదవడం మాకు ఇష్టం


గిద్దలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో లాస్య శివమణి, నాగచరితేష్, జూనియర్స్ విభాగంలో సాధ్య, లాహిత్, సుమేరియాలు మొదటి 3 స్థానాలు సాధించారు. స్టార్ టింబర్ డిపో ప్రతినిధి సయ్యద్ జుబేర్ విజేతలకు బహుమతులు సమకూర్చి అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రామిరెడ్డి, ఫరూఖ్ పాల్గొన్నారు.













గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులుతీర్చుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకు నేందుకు భక్తులు రావటంతో ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి కుంకమార్చన, అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. గాలి గోపురం నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణచేసి స్వామివారికి మహానైవేద్యం సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతలకు పసుపు కుంకుమలతో హారతి ఇచ్చారు. దేవస్థాన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కనిగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ వద్ద ఉన్న జగన్‌కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టరు. గఫార్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి చొరవ వహిస్తామని చెప్పారు. చైర్మన్ వెంట మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

పామూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. సీఎస్‌పురం మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. . రైతు సంక్షేమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. వెలిగొండను పూర్తి చేయడంలో ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు.

సభలో నాయకులు పిల్లి తిప్పారెడ్డి, ఊసా వెంకటేశ్వర్లు, ఎం.రత్నారెడ్డి, నారా భాస్కరరెడ్డి, గుడిపాగి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఎన్‌ఏపీ నిర్వహణ

- పనిచేయని ఫిల్టర్‌బెడ్లు
- శుద్ధి చేయకుండానే తాగునీరు విడుదల చేస్తున్న అధికారులు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు



సక్రమంగా పనిచేయని ఫిల్టర్ బెడ్లు

దర్శి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతిపెద్ద మంచినీటి ప్రాజెక్టు అయిన దర్శి ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం నిర్వహణ అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక పథకం నిర్వీర్యం అవుతుంది. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పథకం పాలకుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారింది. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వ అసమర్థపాలనలో చిన్న మరమ్మతులకు కూడా నోచుకోలేదు. సుమారు 127 గ్రామాలకు మంచినీరు అందించే ఈ పథకం అస్తవ్యస్తంగా మారటంతో ప్రజలకు శుద్ధిజలాలు అందక రోగాల బారినపడుతున్నారు. నెథర్లాండ్ ఆర్థిక సహకారంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేయకపోవటంతో మూలనపడే పరిస్థితి నెలకొంది. ఎన్‌ఏపీ చెరువు అధికశాతం పూడిపోవటంతో నిల్వ సామర్థ్యం తగ్గిపో యింది. చెరువులో నీరు నిండుగా ఉన్నట్లు రీడింగ్ చూపుతు న్నా అడుగుభాగం పూడిపోవటంతో నీటి నిల్వ తక్కువగా ఉంటుంది. వేసవి వచ్చేసరికి చెరువు అడుగంటి తాగునీటి స మస్య ఏర్పడుతుంది. ప్రాజెక్టు ఏర్పాటు సమయంలో నిర్మిం చిన ఫిల్టర్ బెడ్లు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోలేదు. ఫిల్టర్‌బెడ్లకు వేసిన కంకర తగ్గిపోయింది. ఇసుక మట్టిలా మా రిపోయింది. దీంతో సక్రమంగా ఫిల్టర్ కావటం లేదు. అధికా రులు అరకొరగా ఫిల్టర్ అయిన నీటిని ప్రజలకు అందిస్తుండ టంతో కలుషిత నీరుతాగి ప్రజలు రోగాలబారిన పడు తున్నారు.

కాలంచెల్లిన పైపులైన్లు

సుమారు 40 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన పైపులైన్లు కాలం చెల్లిపోవటంతో తరచూ పగిలిపోతున్నాయి. ఫిల్టర్‌బెడ్ల నుంచి వచ్చిన నీటిని సంపునకు విడుదలచేసి అక్కడనుంచి పైపులైన్లకు నీరు పంపిణీ చేస్తారు. మంచినీటి సంపు కూడా శిథిలమై కూలేదశకు చేరింది. పైపులైన్లు ప్రతిరో జు ఎక్కడో ఒకచోట పగిలిపోతున్నాయి. ప్రస్తు తం అన్నిప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధి చేయటం తో అడుగు భాగాన సుమారు పది అడుగుల లోతులో ఉన్న పగిలిన పైపులైన్లు గుర్తించి మర మ్మతులు చేసేందుకు సిబ్బందికి ఇబ్బందిగా మారింది. రక్షిత మంచినీటి పథకం అన్నివిభా గాల్లో ఇబ్బందికరంగా మారటంతో ఇదే పరిస్థితి కొనసాగితే కొంతకాలానికి పథకం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంటుంది. అధికారులు, సిబ్బంది పథకం నిర్వహణ పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. ఫిల్టర్‌బెడ్లు సక్రమంగా పనిచేయకపోవడంతో నీరు సక్రమంగా శుద్ధికావటం లేదనే విషయం తెలిసినప్పటికీ క్లోరినేషన్ సరిగా చేయకుండా మంచినీరు పంపిణీ చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన సంపు



దర్శి రక్షిత మంచినీటి ఎన్‌ఏపీ చెరువు

ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ద ర్శి ప్రాంతంలో జ్వరాలు విపరీతంగా ఉన్నాయి. కలుషిత నీరు తాగటం వల్ల అధికంగా విషజ్వరాలు సోకుతున్నాయని వైద్యు లు తెలుపుతున్నారు. ప్రజల ఇబ్బందులను ఆర్‌డబ్ల్యూఎస్ అ ధికారులు గుర్తించి కనీసం నిబంధనల ప్రకారం క్లోరినేషన్ చే సిన నీటిని అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఉన్న తాధికారుల పర్యవేక్షణ లోపించటంతో కొంతమంది స్థానిక అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పథకం ఆశించిన రీతిలో నడవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు స్వచ్ఛమైన నీరందించేందుకు అవసర మైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి సహకరి స్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఏపీటీ ఎఫ్ నిరసన వారం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సంఘ నాయ కులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ ఏపీటీఎఫ్ వినతి మేరకు ఉపాధ్యాయుల సమస్యలను సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి లోకేష్ బాబు దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి ప్రత్యేక చొరవ వహిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్య దర్శి నాయబ్‌రసూల్, పి.రాజ్‌కుమార్, కె. రామ్మోహన్, ఒంగోలు వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు, ఆనంద్‌బాబు, హజరత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారాయుడు, కేవీ సుబ్బ య్య, నజీర్‌బాషా, రాములు, గోపాలకృష్ణ, మచ్చా ప్రసాద్, పాకల శ్రీనివాసులు, సాల్మన్, పెన్నా వెంకటేశ్వర్లు, హుస్సేన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ముండ్లమూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈసందర్భంగా ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి గురువులు పాశం కృష్ణయ్య పంతులు, పుట్టం రాజు శ్రీరామ చంద్రమూర్తి, పాతూరి వెంకటేశ్వరరావు, ఖరీదు వెంకటరంగారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్బారావును ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి రామ బ్రహ్మాచారి, జె.అనిల్‌కుమార్, జి.సతీష్, సుంకర వెంకారెడ్డి, గోవిందు, వాకా చినబ్రహ్మానందరెడ్డి, వాకా వాణి, ప్రమీల, గంగాదేవి, బి.శ్రీనివాసరావు, పి.వీరాంజనేయులు, బి.రమేష్, ఆదిలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రేపటి నుంచి క్రీడాపోటీలు

పీసీపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ ప్రసాద్ తెలిపారు. స్థానిక పీఎంశ్రీ పాఠశాల ఆవరణలో జరిగే ఈ క్రీడలలో 14 నుండి 17సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. 16న అండర్ 14, 17 వయసు విభాగాల్లోని బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహి స్తారు. 17న యోగా, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సెల్‌ఫోన్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

పామూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వీలైనంత వరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, అపెక్స్ పుస్తకాల రచయిత, విద్యావేత్త వాసిరెడ్డి అమర్నాధ్ తెలిపారు. ఇంటి ఆహారాన్ని తీసుకొంటూ పాజిటివ్ ఆలోచనలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని చెప్పారు. ఆదివారం స్థానిక పువ్వాడి ఫంక్షన్‌హాల్‌లో ఆల్ఫా ఒలంపియాడ్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్‌తో విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారని అన్నారు. అలాగే శారీరక, మానసిక రుగ్మతలతో నేర ప్రవృత్తి పెరిగి పోతుందన్నారు. కార్యక్రమంలో బిజ్జం శ్రీనివాసరెడ్డి, నరాల వెంకటరెడ్డి, సీహెచ్ జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె జబ్బుల నివారణ

పామూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా ఉదయం పూట నడక, చిన్నపాటి వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులను నియంత్రించకోవచ్చునని ఒంగోలు మెడిక్యూర్ మల్టీస్పెషాలిటీ హస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.శ్రీధర్‌బాబు తెలిపారు. స్థానిక డాక్టర్ గద్దె ఏడుకొండలు (అశ్వని హాస్పిటల్)లో ఆదివారం గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవనంలో మానసిక ఒత్తిడికి గురవుతూ గుండెపోటుతో మరణిస్తున్న వారిసంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. మద్యం, దూమపానాకి దూరంగా ఉండాలన్నారు. మంచి ఆహారం, రోజువారీ నడకతో ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. చాతిలో నొప్పి, బరువుగా ఉండటం, చెమటలు పట్టడం, ఎడమ చేతివైపు నొప్పి రావడం, తల తిరగడం, ఆయాసం, వీపులో నొప్పి, చిన్న పిల్లకు గోళ్లు నీలం రంగులో మారడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలకులు

పామూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక షాదీ మంజిల్ హాల్‌లో జరిగిన సీఐటీయూ మండల మహా సభకు షేక్ అల్లభక్ష్ అధ్యక్షత వహించారు. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానలనే కూటమి ప్రభుత్వం అమ లుచేస్తుందని చెప్పారు. సమావేశంలో సయ్యద్ హనీఫ్, కె.మాల్యాద్రి, ఎస్డీ షమ్మి, వి.శ్రీను, సుబ్బమ్మ, చెన్నమ్మ, సుబ్బరత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

కనిగిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం సాధ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సీఐ టీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అ మలుచేస్తున్నాయని అన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పీసీ కేశవరావు, ఎన్‌పద్మ, వి.దేవాదానం, మాల్యాద్రిరెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు

పీసీపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య పాన్ ఇండియా ఐకానిక్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. గుంటూరులోని నెక్స్‌జన్ ఇంట ర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం టీచర్స్ హబ్ ఇండియా ఆధ్వ ర్యంలో పాన్‌ఇండియా ఐకానిక్ ఉపాధ్యాయ అవార్డును అం దజేశారు. గత కొన్నేళ్లుగా సొంత నిధులతో పాటు దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు ఉ త్తమ బోధన, యోగా నేర్పిస్తూ రమణయ్య చేస్తున్న సేవల ను టీచర్స్ హబ్ ఇండియా గుర్తించింది. అందుకు గాను పాన్ ఇండియా ఎడ్యు కేషన్ అవార్డు 2025కు రమణయ్యను ఎంపికచేశారు. ఈ అవార్డును ఇస్రో శాస్త్రవేత్త చందు శ్రీనివాస్, టీచర్స్ హబ్ ఇండియా ఆర్గనైజర్ అనిల్‌కుమార్ చేతులమీదుగా అందుకున్నారు.




అవార్డు అందుకుంటున్న రమణయ్య

కనిగిరిలో రూ.2 లక్షల చోరీ

కనిగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న ఉప్పురోడ్డులోని ఓ ఇంటిలో రూ.2.10 లక్షల చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానికంగా ఉంటున్న మునుగునూ రి సత్యవతి అనే వృద్ధురాలు శనివారం పామూరులోని కుమారుడి వద్దకు వెళ్లింది. ఆదివారం సాయంత్రం గేటుకు తాళంవేసి ఇంటి తలుపులు తీసిఉండటంతో ఎదురింటివారు ఆమెకు ఫోన్ చేశారు. తాను ఇంట్లోలేనని కుమారుడు వద్దకు వెళ్లానని తెలిపారు. విషయం తెలిసి ఆమె హుటాహుటీన ఆదివారం రాత్రి ఇంటికి చేరుకు ని చూడగా బీరువాలోని రూ.2.10 లక్షలు అపహరణకు గురయ్యాయని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.














స్త్రీశక్తి.. సూపర్



ఆర్థిక భరోసా కలిగేలా.. మహిళల్లో సాధికారిత పెంపొందేలా.. ప్రయాణ భారం నుంచి ఉపశమనం పొందేలా.. అన్ని వర్గాల మహిళలకు దన్నుగా.. ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' విజయవంతంగా సాగుతోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రారంభించారు. ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్న మహిళలు 'స్త్రీశక్తి' ప్రారంభంతో సంబరాలు చేసుకున్నారు. సూపర్ సిక్స్‌లో స్త్రీ శక్తి పథకానికి మహిళలు నీరాజనాలు పలుకుతున్నారు. పథకం ప్రారంభం నుంచి రోజురోజుకు మహిళలు, విద్యార్థినుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో పథకాన్ని ఆర్టీసీ అధికారులు విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఉచిత ప్రయాణంలో ఎటువంటి అవాంతరాలు ఎదురుకాకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గత నెల రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగింది. ఈ నెల రోజుల వ్యవధిలో ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లె వెలుగు బస్సుల్లో అంచనాలకు మించి మహిళలు ప్రయాణిస్తున్నారు. ఈ పథకం తో ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. అన్ని వర్గాల మహిళలకు స్త్రీశక్తి పథకం దన్నుగా నిలుస్తోంది.

ఆర్థిక వెసులుబాటు

ఈ పథకం సద్వినియోగం చేసుకుంటున్న వారిలో రోజువారీ కూలి పనులకు వెళ్లే నిరు పేదలతో పాటు పట్టణాల్లో కూరలు, పండ్లు తదితరాలు విక్రయించు కునే చిరువ్యాపారులు ఎక్కు వగా కనిపిస్తున్నారు. రోజువారీ ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం మరింత గా ఆర్థిక వెసులుబాటు అందిస్తోంది. దీంతో వీరందరూ ఉచిత ప్రయాణం ద్వారా నెలకి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు టిక్కెట్ల వ్యయం మిగులుతోంది. విద్యార్థినులు నెలవారీ బస్సు పాసులు కొనుగోలు చేసి ప్రయాణించేవారు. వీరికి ఈ ఉచిత ప్రయాణం కలిసివచ్చింది.

పథకం ప్రారంభించి నెల
రోజురోజుకు పెరుగుతోన్న ఆదరణ

- ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం
- చిరుద్యోగులకు నెలకు రూ.3 వేల వరకు ఆదా
- ఆర్టీసీ బస్సుల్లో గణనీయంగా పెరిగిన ఆక్యుపెన్సీ

● బస్సు నడపండి..

స్త్రీశక్తికి శ్రీకారం చుట్టిన నెల రోజుల వ్యవధిలో డిపోల వారీ గా తమ ప్రాంతానికి బస్సు నడపాలనే డిమాండ్లు అధికమవు తున్నాయి. నేతలతో పాటు ప్రజల నుంచి కూడా ఆర్టీసీ అధికారులకు వస్తోన్న అర్జీలన్నీ కూడా పల్లె ప్రాంతాలవే కావడం గ్రామీణులకు స్త్రీశక్తి పథకం ఏ స్థాయిలో ఉపయోగడ పడుతుందో అద్దం పడుతోంది. పథకానికి వస్తున్న ఆదరణతో పాటు ప్రయాణికుల నుంచి వస్తున్న వినతులను పరిగణనలోకి తీసు కున్న అధికారులు అదనపు బస్సుల ప్రతిపాదనలపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు.





బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

రేపల్లె బస్టాండ్ బస్సు ఎక్కుతున్న మహిళలు

30 రోజులు.. 18 లక్షల జీరో టిక్కెట్లు

బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె డిపోల పరిధిలో 253 బస్సులు ఉండగా 214 బస్సుల్లో స్త్రీశక్తి పథకం అమలవు తుంది. గతంలో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 75,000 వర కు ఉండగా అందులో మహిళల వాటా 40 శాతంగా ఉండేది. స్త్రీశక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా రోజువారీ ప్రయాణికుల సంఖ్య దాదాపు లక్షకు చేరుకోగా అన్ని బస్సులోనూ ఆక్యుపెన్సీ వందశాతానికి చేరింది. 65 రూట్లలో అయితే 150 శాతం ఆక్యుపెన్సీ నమోదవుతుంది. ఈ నెల రోజుల్లో 18 లక్షల జీరో టిక్కెట్లు జారీ చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. తద్వారా ఆర్టీసీకి అదనంగా సమకూరిన ఆదాయం రూ.6 కోట్లు ఉంది. సగటున రోజుకు 55,000 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నట్లు జీరో టిక్కెట్ల జారీ లెక్కల ద్వారా తెలుస్తుంది. పథకం అమలైన తొలివారం రోజువారీ మహిళా ప్రయాణికుల సగటు 40,000కు పరిమితం కాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 55,000కు చేరడం గమనార్హం.

గ్రామీణ నేపథ్యం ఎక్కువగా ఉండడమే...

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ నేపథ్యం ఉన్న ప్రాంతాలే ఎక్కువ. ఈ కారణంగానే జిల్లాలో స్త్రీశక్తి ఇంతభారీగా విజయవంతం అవుతుందని తెలుస్తోంది. ఈ నెల రోజుల వ్యవధిలో జారీ చేసిన జీరో టిక్కెట్లలో దాదాపు 60 శాతం రూ.50లోపే. పల్లెల నుంచి మండల కేంద్రాలకు అత్యధికంగా మహిళలు ప్రయాణించారు.


(బాపట్ల ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకం జిల్లావ్యాప్తంగా సూపర్ సక్సెస్ అయింది. ఈ పథకాన్ని స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15న ప్రారంభించగా శనివారంతో 30 రోజులు పూర్తి చేసుకుంది. సోమవారంతో పథకానికి శ్రీకారం చుట్టి నెల రోజులు అవుతుంది. ఆర్టీసీ బస్సులో రోజువారీ ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదలతో స్త్రీశక్తి పథకం సూపర్‌హిట్ దిశగా వెళుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమ వుతోంది. నారీమణుల నుంచి స్త్రీశక్తి అత్యంత (మిగతా 8వ పేజీలో)

గంజాయి కట్టడిపై దృష్టి

ఎస్పీగా ఉమామహేశ్వర్ బాధ్యతలు స్వీకారం

తీర ప్రాంత భద్రతకు ప్రత్యేక చర్యలు



బాధ్యతలు స్వీకరిస్తున్న బి.ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను కట్టడి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం వేదపండితుల మంత్రోశ్ఛరణల మధ్య ఎస్పీగా బి.ఉమామహేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. అంతకముందు ఆయనకు పోలీసు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన జిల్లా మూడో ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. డీఎస్పీలు పి.జగదీష్‌నాయక్, ఎ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండి మోయిన్, పి.విజయసారధి, సీఐలు, ఎస్సైలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తామన్నారు. సముద్రతీర ప్రాంతంలో ప్రత్యేక భద్రతా చర్యలపై మరింత దృష్టి పెడతామన్నారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. నేరస్తులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

అధికారులతో సమీక్ష

బాధ్యతల స్వీకరణ అనంతరం అధికారులతో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు, స్థానికంగా ఉన్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ ప్రాధాన్యతను అనుసరించి నేరనియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. గంజాయి రవాణా, విక్రయాల కట్టడికి తగిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సైబర్, వైట్‌కాలర్ నేరాలను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను నిబద్ధతతో నిర్వహిస్తే అధికశాతం నేరాలను ఆదిలోనే అరికట్టవచ్చన్నారు. సముద్రతీరంలో పర్యటించే యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గస్తీ పెంచాలని తెలిపారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు అవసరమైన సహాయాన్ని తక్షణమే అందించాలన్నారు.

బార్లకు మళ్లీ గడువు పెంపు

- ఈ నెల 17 వరకు పొడిగించిన ఎక్సైజ్
- జిల్లాలో రీనోటిఫికేషన్‌లో వచ్చిన దరఖాస్తులు 17

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యం బార్ల ఏర్పాటుకు సంబంధించి ఎక్సైజ్‌శాఖ జారీ చేసిన రీ నోటిఫికేషన్‌లో తొలుత ఇచ్చిన గడువు ఆదివారంతో ముగిసింది. రెండో సారి దరఖాస్తుల కోసం ఆహ్వానించినా స్పందన అరకొరగానే ఉంది.



దీంతో దరఖాస్తులకు మరో మూడు రోజులు గడువు పొడిగిస్తూ ఎక్సైజ్ విభాగం నిర్ణయం తీసుకుంది. బార్ల ఏర్పాటుకు సంబంధించి ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. జిల్లాలో మొత్తం 15 బార్లకు ఇప్పటి వరకు 17 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీకి అవకాశం ఉంటుంది. గడువు పొడిగించడంతో ఈ మూడు రోజుల్లో వచ్చే దరఖాస్తులపైనే ఆశలు పెట్టుకున్న అధికారులు శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు.

బీచ్.. పనులు వేగవంతం చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ● ఎమ్మెల్యే వేగేశనతో కలిసి ఫెస్టివల్ ప్రాంగణం పరిశీలన

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 26, 27, 28 తేదీల్లో సూర్యలంక తీరంలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సూర్యలంక తీరాన్ని ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. బీచ్ ఫెస్టివల్‌ను వేడుకగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేగేశన సూచించారు.

రాష్ట్రీయ పండుగలా ఫెస్టివల్

బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్రీయ పండుగలా అత్యంత ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వాహణపై కలెక్టరేట్ నుంచి ఆదివారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేది నాటికి బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేడుకలకు హాజరవుతున్నందున ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. తేదీల వారీగా వేడుకల షెడ్యూల్ విడుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, పర్యాటక కార్పొరేషన్ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ప్రమోద్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, డీపీవో ప్రభాకర్, రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, పౌరసరఫరాలశాఖ డీఎమ్ శివపార్వతి, డీఎస్వో జలీల్‌బాషా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్ ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

వీర్లచెరువు వెలవెల

- అడుగంటిన నీరు.. సాగు ప్రశ్నార్థకం
- డంపింగ్ యార్డుగా మారిన చెరువు ప్రాంతం

బల్లికురవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీరు లేక మండల పరిధిలోని వీర్లచెరువు వెలవెలపోతోంది. చెరువుకు నాగార్జున సాగర్ నుంచి నీరు వచ్చే కాల్వలు సక్రమంగా లేవు. సాగర్ జలాశయం నుంచి నెల నుంచి నీరు విడుదల అవుతున్నా చెరువుకు సక్రమంగా నీరు చేరలేదు. చెరువులో నీరు లేకపోవడంతో ఆయకట్టు పరిధిలో పంటల సాగు ప్రశ్నార్థకంగా ఉంది. చెరువు భూభాగంలో కొందరు రాత్రిళ్లు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థరాళ్లను పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. దీంతో ముందు ముందు చెరువులో నీటితో పూర్తి స్థాయిలో నిండితే ఈ రాళ్లు అడ్డుగా మారతాయని రైతులు వాపోతున్నారు. నక్కబొక్కలపాడు, బల్లికురవ గ్రామాల పరిధిలోని భూములకు ఈ చెరువు నీరే ఆధారం. చెరువు కింద బల్లికురవ గ్రామ ఎత్తిపోతల పథకం ఉంది. పర్యవేక్షణ లేకపోవడంతో చెరువు పరిస రాల్లో వ్యర్థాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని రైతులు అంటు న్నారు. చెన్నుపల్లి రోడ్డులో చెరువు అంచుల్లో వ్యర్థాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.



● నీరు లేక ఒట్టిపోయిన వీర్ల చెరువు

స్కూళ్లకు సార్లొస్తున్నారు..

- తుది దశకు మెగా డీఎస్సీ మెరిట్ జాబితా
- ఎంపికైన ఉపాధ్యాయులకు 20 నుంచి కౌన్సెలింగ్
- 19న ముఖ్యమంత్రి ద్వారా నియామక పత్రాల పంపిణీ
- రాజధానిలో బహిరంగ సభ.. ప్రతీ మండలం నుంచి బస్సులు
- ఎంపికైన అభ్యర్థితో పాటు మరొకరికి అవకాశం.. ఏర్పాట్లలో అధికారులు

(వేమూరు, గుంటూరు- విద్య, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరిపోనున్నది. ఈ నెలాఖరుకు స్కూళ్లకు ఉపాధ్యాయులు రానున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందిని ఎంపిక చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 19న స్వయంగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి రాజధాని అమరావతి సచివాలయం సమీపంలో బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయులతో నిర్వహించే సభను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఈ సభలో పాల్గొనేందుకు అవసరమైన ఆహ్వానాలను నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అధికారులు అందజేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థి తనతో పాటు కుటుంబంలోని మరో వ్యక్తిని కూడా సభకు తీసుకువచ్చేందుకు అనుమతి ఇచ్చారు. వీరందరూ సభకు హాజరయ్యేందుకు ప్రతీ మండలం నుంచి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తున్నారు. ఆ బస్సుల ఏర్పాటు బాధ్యతను విద్యాశాఖాధికారులకుప్రభుత్వం అప్పగించింది.



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

1,130 పోస్టుల భర్తీ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1600 ఉపాధ్యాయ పోస్టులకు ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెగా డీఎస్సీ లో ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా తుది దశకు చేరింది. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా అర్హులైన అభ్యర్థులను క్యాడర్ల వారీగా ఎంపిక చేసి జాబితాను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ఆదివారం వరకు నిబంధనలను అనుసరించి సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, గుంటూరు డీఈవో రేణుక పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇందులో ప్రస్తుతానికి సుమారు 1,130 పోస్టుల భర్తీకి విద్యాశాఖ సిద్ధమైంది. 530 ఎస్‌జీటీ, 600 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల ఆధారంగా మెరిట్ లిస్టు విడుదల చేసి గతంలో ఉపాధ్యాయులను నియమించేవారు. అయితే ఈసారి కౌన్సెలింగ్ తరహాలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. మెరిట్ ఆధారంగా పాఠశాలలకు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం నియామకాలు జరగనున్నాయి. దీని వల్ల పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యం నిరోధించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వరద విపత్తుపై ముందస్తు చర్యలు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్
- వారధి వద్ద గండి పరిశీలన.. అధికారులతో సమీక్ష



అరవింద వారధి వద్ద వరద ప్రవాహంతో పాటు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కొల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణానదికి నీటి ప్రవాహం పోటెత్తుతున్నందున వరద విపత్తును ఎదుర్కొనేందుకుముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కొల్లూరు మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద నదిలో వరద ప్రవాహంతో పాటు వారధి ఎగువన పడిన గండి ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల గురించి ఆర్డీవో రామలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నదిలో గత ఏడాది 11 లక్షల పైచిలుకు నీరు వచ్చినందున ఇప్పుడు అంతకు మించి వస్తే వరద విపత్తును ఏవిధంగా ఎదుర్కోవాలో అధికారులు నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయిన వెంటనే అధికారులంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 2 లక్షల 70 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని, అది మరింత పెరిగి 3.50 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బోట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరదకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులు వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

రెవెన్యూ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ : కలెక్టర్

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అర్జీదారులు ఆన్‌లైన్ ద్వారా అర్జీలను నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం మీ కోసం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అర్జీదారులు ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల స్థితికి సంబంధించి టోల్ ఫ్రీనెంబరు 1100కు కాల్ చేయవచ్చన్నారు.

అవీ..ఇవీ..

తక్కువ ధరకే కర్నూలు ఉల్లి అమ్మకాలు



అన్నగారి సంతలో అమ్మకాలు చేస్తున్న ఉల్లిపాయలు

అద్దంకి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఉల్లిధరలు తగ్గిపోయి రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతు బజారులలో అమ్మకాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అద్దంకి మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నగారి సంతలో కూడా కర్నూలు ఉల్లిపాయల అమ్మకం ప్రారంభించారు. రూ.100కు 6 కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. సుమారు టన్ను ఉల్లిపాయలు అద్దంకి మార్కెట్ యార్డుకు వచ్చాయి. దీంతో ఆదివారం అమ్మకాలు ప్రారంభించారు. బయట మార్కెట్‌లో కిలో ఉల్లిపాయలు రూ.25 ఉండగా మార్కెట్ యార్డులో తక్కువ ధరకే వస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు ఏఎంసీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ నేత మందా నాగేశ్వరరావులు ఉల్లిపాయల కొనుగోలు ను పర్యవేక్షించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురికి గాయాలు

● తీవ్రంగా గాయపడిన ఇద్దరు ఒంగోలు తరలింపు



గాయపడ్డ వేణు, రోహిత్

అద్దంకి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఆదివారం మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొన్నాయి. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన యరమోదు అంజయ్య భవాని సెంటర్‌లో మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అద్దంకి పట్టణంలో నుంచి శింగరకొండ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. సాయంత్రం మేదరమెట్లకు చెందిన వడ్లమూడి వెంకటేశ్వరరావు మోటార్‌సైకిల్ పై వెళ్తూ రాజీవ్‌కాలనీ సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. రామ్‌నగర్‌లోని మార్కెట్ యార్డు వద్ద అద్దంకి పట్టణానికి చెందిన వేణు, రోహిత్‌లు మేదరమెట్ల వైపు నుంచి అద్దంకి వస్తుండగా రాంగ్‌రూట్‌లో రామ్‌నగర్ నుంచి మార్కెట్ యార్డులోకి వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. గాయపడ్డ వేణు, రోహిత్‌లను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు.

స్త్రీ శక్తి.. సూపర్

(5వ పేజీ తరువాయి)

ఆదరణ లభిస్తోంది. జిల్లాలో పెద్దఎత్తున మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు వస్తున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. జీరో టిక్కెట్లు జారీ చేస్తూ రోజు వారీ ఎంత మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారో నమోదు చేస్తోంది. భవిష్యత్తులో మరింతగా పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సులను సిద్ధం చేసుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇదిలా ఉంటే స్త్రీశక్తి పథకం అమలయ్యాక జిల్లాలో తిరిగే హైటెక్ బస్సుల్లో ఆక్యుపెన్సీలో స్వల్ప స్థాయి తగ్గుదల కనబడుతోంది. మొత్తం ఉన్న బస్సుల్లో హైటెక్ బస్సుల సంఖ్య అతి స్వల్పంగా ఉండడంతో అది ఆర్టీసీ ఆదాయంపై పెద్దగా ప్రభావం చూపదనే అభిప్రాయాన్ని యంత్రాంగం వ్యక్తం చేస్తోంది. ఉదయం 8 గంట నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మహిళల రద్దీ బస్సుల్లో ఎక్కువగా ఉంటోందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

మందుబాబుల బీభత్సం

● నరసరావుపేట నుంచి చీరాలకు కారులో వచ్చిన యువకులు
● తిరిగి వెళ్లే సమయంలో స్కూటీను, ఆటోను ఢీ
● ఐదుగురికి గాయాలు
● టూటౌన్ పోలీసుల అదుపులో నిందితులు

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యంమత్తులో పలువురు యువకులు రెండు రోడ్డు ప్రమాదాలకు కారకులయ్యారు. వివరాల్లోకి వెళితే ఆదివారం మధ్యాహ్నం నరసరావుపేట నుంచి రామాపురం తీరానికి కారులో ఐదుగురు యువకులు వచ్చారు. రాత్రి వరకు ఈ ప్రాంతంలోనే ఉన్నారు. మద్యంమత్తులో తిరిగి వెళుతూ మన్నం అపార్ట్‌మెంట్ వద్ద జాతీయ రహదారి ఎక్కేందుకు కారును వేగంగా నడిపారు. ఆ సమయంలో లక్ష్మీపురానికి చెందిన స్కూటీపై వెళుతున్న వ్యక్తిని ఢీ కొట్టారు. దీంతో ఆయన గాయల పాలయ్యాడు. అక్కడ నుండే తప్పించుకునే క్రమంలో హాయ్ రెస్టారెంట్ సమీపంలో ఓ ఆటోను వెనుక నుండి వేగంగా ఢీ కొట్టారు. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోతో పాటు కారు కూడా రోడ్డు పక్కన కాలువలోకి దూసుకుపోయింది. దీంతో స్థానికులు వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

అందరి మదిలో నిలిచేవే కావ్యాలు

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అన్ని వేళలా అందరి మదిలో నిలిచేవీ.., అందరిని ఉల్లాస భరితంగా నింపేవి కావ్యాలేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సాహితి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖుల కావాల్యను స్మరించి కొనియాడారు. అలాగే కవులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు సంఘ సేవకులు దగ్గుబాటి హరిప్రసాద్ సంస్మరణ సభలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అప్పాజోస్యుల సత్యనారాయణ, యలమందరెడ్డి, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, వూర మస్తాన్‌రావు, నాగవీరభద్రాచారి, డా.బీరం సుందరరావు, శివాంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రామారావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణ

చినగంజాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అందజేయనున్న వాహన మిత్ర సాయానికి ఈ నెల 17వ తేది నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్ విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేది వరకు నూతన దరఖాస్తులకు అవకాశం ఉంటుందని, 22వ తేదిన క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయడం, 24వ తేదీ నాటికి తుది జాబితా సిద్ధంచేయనున్నట్లు తెలిపారు. అక్టోబరు 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 15 వేల రూపాయిల ఆర్థిక సాయాన్ని జమ చేస్తారన్నారు. దరఖాస్తుదారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్టర్ అయిన వాహనం కలిగి ఉండాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ యాజమానులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఆటో రిక్షా యాజమానులకు, తాత్కాలికంగా మినహాయింపు ఉందని, కానీ నెలలోపు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు పేదరిక రేఖకు దిగువన ఉండాలని లేదా బీపీఎల్ రేషన్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా పెన్షనర్లు అయితే అనర్హులన్నారు. పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మినహాయింపు వర్తిస్తుందన్నారు.

ప్లాట్లు సిద్ధం.. మౌలిక వసతులే తరువాయి

● నివాసాల కోల్పోతున్న వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం ● రూ.15 కోట్లతో కాలువకట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు ఏర్పాట్లు

అద్దంకి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో అంతర్భాగంగా ఉన్న అద్దంకి మేజర్ కాలువకట్టను మినీ బైపాస్‌గా మార్చే పనులు ప్రారంభం కానున్నాయి. దీనికి ఆక్రమణల తొలగింపే ప్రధాన అడ్డంకిగా ఉంది. దీనిపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. కాలువ కట్టలు ఆక్రమించి సుమారు 100కు పైగా కుటుంబాలు నివాసం ఉంటుండగా వారిలో సుమారు 35 మందికి బొమ్మనంపాడురోడ్డులోని లే-అవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. మిగిలిన 65 మందికి శింగరకొండపాలెం సమీపంలోని అద్దంకి కొండ వద్ద ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్లాట్లు సిద్ధం చేశారు. ఇళ్లస్థలాలు కేటాయించే ప్రాంతం లోతైన గోయ్యి కావటంతో మెగా ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో లెవలింగ్ చేయించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మౌలిక వసతలు కల్పన ప్రారంభించారు. ఇప్పటికే రోడ్లు ఏర్పాటు పూర్తి కాగా, త్వరలో విద్యుత్ స్తంభాలు, బోర్ల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. కాలువ కట్టను రేణింగవరం రోడ్డులో కాకానిపాలెం నుంచి నామ్‌రోడ్డు వరకు మినీబైపాస్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.15 కోట్ల అంచనాతో టెండర్ల దశకు చేరింది. త్వరలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అద్దంకి పట్టణంలో పర్యటించనున్నారు. అదే రోజు మినీ బైపాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. అద్దంకి పట్టణంలో మూడు కమ్యూనిటీ భవనాలను కూడా మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ప్రారంభిస్తారని ఇటీవల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు.



అద్దంకి కొండ వద్ద సిద్ధమైన ప్లాట్లు

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

● విద్య, వైద్యానికి ప్రభుత్వం బాసట ● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు విద్య, వైద్యం పట్ల కూటమి ప్రభుత్వం చక్కని బాటలు వేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఆదివారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు రూ.1.02 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు ఆపసోపాలు పడినట్లు వివరించారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్విరామంగా ప్రజా సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి దూర చూపుతో ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలోనే ఇకపై ఆరోగ్యశ్రీ ప్రతి కార్డుకు రూ.25 లక్షలు వర్తింపజేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు ఐఎంఎ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి హేంద్రనాథ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన

637 మందికి వైద్యసేవలు

ఇంకొల్లు, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా నిరంతరం ప్రజల కోసం పనిచేసే సేవకుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు లు పేర్కొన్నారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఏలూరి చారిటబుల్‌ట్రస్టు, నోవాఅగ్రోటెక్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు శంకరకంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ జనహృదయనేతగా ఏలూరి సాంబశివరావు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. నాయుడు హనుమంతరావు మాట్లాడుతూ ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి ఆయన తండ్రి జ్ఞాపకార్థం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, బోడెంపూడి సుబ్బారావు, నారిశెట్టి రాంబాబు, బాపయ్య, బేతపూడి సురేష్, రఫీ, మీరావలి, శివాజీ, వెంకటేశ్వర్లు, రాజా, చింపిరయ్య, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు

637 మందికి పరీక్షలు

637 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 248 మందికి శాస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. పరీక్షల కోసం ప్రజలు పెద్దఎత్తున బారులు తీరారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రోగులకు బి.పి.షుగర్, రక్తపరీక్షలు చేసి వైద్యసేవలను అందించారు. శిబిరానికి వచ్చిన వారికి భోజనసదుపాయాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా గొయ్యి

పంగులూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిలో ముప్పవరం ఫ్లైఓవర్ ఆనుకుని గ్రామానికి చేరుకునే అప్రోచ్ రోడ్డులో భారీ గొయ్యి ఏర్పడింది. రేణంగివరం నుంచి ముప్పవరం గ్రామంలోకి చేరుకునేందుకు ద్విచక్ర వాహనచోదకులు ఫ్లైఓవర్ ఆనుకుని ఉన్న ఈ అప్రోచ్ రోడ్డులో ప్రయాణం సాగిస్తుంటారు. అప్రోచ్‌రోడ్డులో ఏర్పడిన గొయ్యి వర్షపు నీటితో నిండి ఉండడంతో రాత్రిసమయంలో వాహన చోదకులు గోతిని గుర్తించలేక ప్రమాదాల బారినపడుతున్నారు. గడిచిన పదిరోజుల వ్యవధిలోనే పలువురు ఈ గోతివద్ద ప్రమాదం బారిన పడ్డారు. శనివారం రాత్రి ముప్పవరం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు గోతి చుట్టూపేర్చిన నల్లనిరాళ్లను ఢీకొన్న ఘటనలో చేతికి, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. ఒంగోలు, అద్దంకి ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై పనుల నిమిత్తం వెళ్లే ఈ ప్రాంత ప్రజలు తిరిగి గ్రామాలకు చేరుకునేందుకు అప్రోచ్‌రోడ్డును ఆశ్రయించక తప్పని పరిస్థితి. జాతీయ రహదారిపై గ్రామ ప్రధాన కూడలిలో ఫ్లైఓవర్‌ను ఆనుకుని ఉన్న అప్రోచ్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్నగోతికి తక్షణమే మరమ్మతులు చేయాలని ముప్పవరం, పంగులూరు, కోటపాడు, పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.



రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యి

కారంచేడులో యూరియా కోసం రైతుల బారులు

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులోని పీఏసీఎస్ సహకార సంఘం సొసైటీ వద్ద ఆదివారం యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు తరలి వచ్చి బారులు తీరారు. దీంతో పంపిణీ కేంద్రం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అయితే ఒక ఖాతా నెంబరుకు రెండు యూరియా బస్తాలు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత యూరియా పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రైతులు తమ అవసరం మేరకే యూరియా తీసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. అదనంగా నిల్వలు ఉంచుకోవద్దన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం భారం కాకూడదని కూటమి ప్రభుత్వం వైద్యచికిత్సలు చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అందజేస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో వైద్య చికిత్సలు చేయించుకున్న 60 మందికి మంత్రి రవికుమార్ ఆదివారం చిలకలూరిపేటలోని తన నివాసం వద్ద చెక్కులను అందజేశారు. మరో ఐదుగురికి ఎల్‌వోసీలు అందజేశారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బల్లికురవలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేర్వేరు ఘటనల్లో ఇరువురు మృతి

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రమాదాల్లో చీరాల రైల్వే పోలీసు స్టేషన్ల పరిధిలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. గుర్తుతెలియని వ్యక్తి(45) సంవత్సరముల వ్యక్తి చీరాల - వేటపాలెం రైల్వేస్టేషన్ల మధ్య మృతిచెందాడు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. అలాగే చీరాల రైల్వే స్టేషన్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని అద్దంకి, కొరిశపాడు మండలాలల్లో ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేది వరకు పశువులకు గాలికుంటూ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ మేరకు అద్దంకి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ టీకాల వలన పశువులకు జ్వరం రావడం, పాలు తగ్గడం లాంటివి ఏమి ఉండవన్నారు. తమ సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు పశుపోషకులు సహకరించి పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు.

విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయండి

పంగులూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహిస్తున్న విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షుడు మచ్చావెంకటేశ్వర్లు, తక్కెళ్లపాటి రామకృష్ణ, నాగేంద్రప్రసాద్ కోరారు. మండలంలోని కశ్యాపురం గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయప్రాంగణంలో 21వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వివిధ వర్గాల ప్రజలు విరివిగా పాల్గొని ఈమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. గతకొద్ది రోజులుగా టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యేను కలిసి వినతిని సమర్పించారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు బుర్రా సాంబశివరావు, చుక్కా శ్రీనివాసరావు, నారాయణ, వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, మధు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

మేదరమెట్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండల స్థాయి ఆటల పోటీలు పమిడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జరుగుతాయని మండల స్పోర్ట్స్ సమన్వయకర్త సుల్తాన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయలు అంజయ్య తెలిపారు. అథ్లెటిక్స్‌లో జరిగే ఈ ఆటల పోటీలకు ప్రభుత్వ పాఠశాలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. వివరాలక 62814 22319 నంబరును సంప్రదించాలన్నారు.

నాగవరపమ్మకు సారె

పందిళ్లపల్లి (చీరాల), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో వేంచేసిన నాగవరపమ్మ దేవస్థానంలో బోయినవారిపాలెం, బచ్చులవారిపాలెంకు చెందిన చప్పిడి వారి కుటుబంలోని మహిళ భక్తులు అమ్మవారికి చలిమిడి, సారె ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చప్పిడి వెంకటరావు, ఆదినారాయణ, వెంకటస్వామి, ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

చినగంజాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గేదెలు, ఆవులు, ఆరునెలలు దాటిన దూడలకు ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేది వరకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు చినగంజాం పశు వైద్యాధికారి డాక్టర్ బత్తుల కృష్ణ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పది వేల డోసుల టీకాలు పశు సంవర్థక శాఖ ద్వారా మండలానికి పంపినట్లు పశు వైద్యాధికారి తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో పశు వైద్య సిబ్బంది ఈ టీకాల కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

భారతీయ భావనకు పునాది ఏచూరి

ఘనంగా ప్రథమ వర్ధంతి

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాంస్కృతిక వారసత్వానికి, దేశ పురోగాభివృద్ధికి సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజం, ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రతణకు ఏచూరి వ్యతిరేఖ ఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, ఎన్ బాబురావు, బత్తుల శామ్యేల్, మాచర్ల మోహన్‌రావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, గోసాల ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతున్న వక్తలు

పార్టీ విధేయతకు గుర్తింపు

● విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కోడూరి

పర్చూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ విధేయుడిగా, నిబద్ధతగా పనిచేసిన యువనేతకు కూటమి ప్రభుత్వంలో అరుదైన గౌరవం దక్కింది. పర్చూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత, బీసీ సెల్ నాయకులు కోడూరి శేషబ్రహ్మచారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సిఫారసు మేరకు విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పదవిలో సముచిత స్థానం కల్పించిన ఏమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధి సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కోడూరి పేర్కొన్నారు.




కోడూరి శేషబ్రహ్మచారి


రైలు నుంచి జారి పడి మహిళ మృతి

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఒంగోలు-కరవది రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం జరిగింది. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, నిండు పచ్చ రంగు పంజాబీ డ్రెస్, కుడిభుజం పైన, ఎడమ చేతి మణికట్టుపైన పుట్టుమచ్చలు ఉన్నట్లు రైల్వే ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9440627647 సెల్‌నంబరులో సంప్రదించాలన్నారు.

కారు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని చిరు వ్యాపారి రాయిని శేషయ్య(54) దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం పేర్న మిట్ట సమీపంలో పొగాకు బోర్డు వద్ద జరిగింది. శేషయ్య సమతానగర్‌లో నివాసం ఉంటూ పేర్నమిట్టలో బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాడు. ఒంగోలు నుంచి మోపెడ్ మీద సరుకులు తీసుకెళుతుండగా కారు వెనుక నుంచి ఢీకొనడంతో ఘటన జరిగింది.





జిల్లా పోలీస్ బాస్‌గా నేడు అజిత బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు బాస్‌గా అజిత వేజెండ్ల సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆదివారం సాయంత్రమే పోలీస్ అతిథి గృహానికి చేరుకున్న ఆమెకు జిల్లా పోలీస్ అధికారులు స్వాగతం పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న సంఘటనలు, ప్రతిపక్ష నాయకులపై కేసులు, రౌడీషీటర్ల వరుస అరెస్టులతో శాంతిభద్రతల పరిరక్షణ కత్తిమీద సవాళ్లుగా మారనుంది.



కండలేరు డ్యాం వద్ద 11 కి.మీ పొడవు, 49 మీటర్ల ఎత్తు వంకర్లు తిప్పుతూ నిర్మించిన ఈ మట్టికట్ట ఇంజనీర్ల మేథస్సుకు నిదర్శనం. ఆసియా ఖండంలోనే ఇలాంటి కట్టడం ఇప్పటికీ లేదు.

కండలేరు.. ఓ వండర్ డ్యాం!

అద్భుత నిర్మాణాలు దేశ ప్రగతికి ప్రతీకలు. ఇంజనీర్ల ప్రతిభకు తార్కాణాలు. మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో జిల్లాలో నిర్మించిన కండలేరు జలాశయం ఇంజనీర్ల మేథోసంపత్తికి దర్పణంగా నిలుస్తోంది. ఎంతోమంది ఇంజనీర్లు, శ్రామికులు రేయింబవళ్లు కష్టపడి భావితరాలకు ఈ ప్రాజెక్టును అందించారు. లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు నెల్లూరు, చిత్తూరు, చెన్నైవాసుల దాహం తీరుస్తున్న కండలేరు జలాశయ నిర్మాణం ఓ అద్భుతం. అలాంటి ప్రాజెక్టుతోపాటు జిల్లా జలప్రసాదినిగా పేరు గడించిన సోమశిల జలాశాయాన్నీ ఇంజనీర్లు అద్భుతంగా తీర్చిదిద్దారు. నేడు ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

- సమగ్ర కథనం 7లో..

ఇసుక డ్రెడ్జింగ్‌కు బ్రేక్!

25 రోజులుగా ఆగిన వెలికితీత ప్రక్రియ


ముగిసిన సీటీవో గడువు.. ఆ తర్వాత రాని అనుమతులు

జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. గడిచిన 25 రోజులుగా డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఇసుకను వెలికి తీయడం ఆపేశారు. నదిలో డ్రెడ్జింగ్ చేసేందుకు పర్యావరణ శాఖ ఇచ్చిన కన్సెంట్ టు ఆపరేట్ (డ్రెడ్జింగ్‌కు అనుమతి) గడువు గత నెల 21వ తేదీతో ముగిసింది. దీంతో అప్పటి నుంచి కాంట్రాక్ట్ ఏజన్సీలు డీసిల్టేషన్ చేయడం లేదు. ఈ ప్రభావం ఇసుక నిల్వలపై పడుతోంది.

నెల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మాన్‌సూన్ సీజన్ కావడంతో నదుల్లో ఎక్కడా ఇసుక తవ్వకాలు జరిపేందుకు పర్యావరణ చట్టాలు అనుమతించవు. జూన్ నుంచి ఇసుక తవ్వకాలు ఆగిపోగా, కేవలం డీసిల్టేషన్‌కు మాత్రమే అనుమతి ఉండటంతో సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఇప్పుడు అందుకు కూడా అనుమతుల గడువు ముగిసిపోవడంతో మొత్తంగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. జిల్లాలో మూడు ప్రాంతాల్లో డీసిల్టేషన్‌కు అనుమతి ఉంది. సంగం బ్యారేజీ ఎగువ భాగంలో సంగం, సూరాయపాలెం వద్ద రెండు డీసిల్టేషన్ పాయింట్లు ఉండగా, నెల్లూరు బ్యారేజీ ఎగువ భాగంలో పోతిరెడ్డిపాలెం వద్ద మరో పాయింట్ ఉంది. ఈ మూడు ప్రాంతాల్లో సరాసరి రోజుకు రెండు వేల టన్నుల వరకూ ఇసుకను వెలికి తీసుకొచ్చేవారు. వేసవి కాలంలో ఇసుక వినియోగం కూడా ఇదే పరిమాణంలో ఉండగా, ప్రస్తుతం అది క్రమేణా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం రోజుకు వెయ్యి టన్నుల వరకూ ఇసుక వినియోగం జరుగుతున్నట్లు అంచనా. ఇలా డ్రెడ్జింగ్ ద్వారా తీసిన ఇసుకను స్టాక్ యార్డుల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచే ప్రస్తుతం ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సంగం యార్డులో సుమారు 70 వేల మెట్రిక్ టన్నులు, సూరాయపాలెంలో యార్డులో సుమారు 40 వేల మెట్రిక్ టన్నులు, పోతిరెడ్డిపాలెం యార్డులో సుమారు 8 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయి. గడిచిన మూడు వారాలుగా డీసిల్టేషన్ లేకపోవడంతో ఈ నిల్వల నుంచే విక్రయాలు జరుపుతున్నారు.

● **రానున్నది వరదల కాలం**

రానున్నది వర్షాకాలం కావడం, అందులోనూ సోమశిల నుంచి



సంగం డీసిల్టేషన్ పాయింట్ వద్ద ఒడ్డున నిలిచి ఉన్న డ్రెడ్జింగ్ పడవ

పెన్నాకు నీటిని విడుదల మొదలుపెట్టారు. ఈ క్రమంలో అక్టోబరు 15 తర్వాత మాన్‌సూన్ సీజన్ ముగిసినా నేరుగా వెళ్లి ఇసుక తవ్వకాలు జరపడం కొంత కష్టంగా మారుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నిర్మాణ రంగం, పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్లు ఇసుక నిల్వ చేసుకోవాల్సిన అవసరముంది. డ్రెడ్జింగ్‌కు కన్సెంట్ టు ఆపరేట్ (సీవోటీ) అవసరమని ఇరిగేషన్ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ఆ వెంటనే కలెక్టర్ కూడా పర్యావరణ శాఖ రాష్ట్ర అధికారులకు లేఖ రాశారు. కానీ ఇంత వరకు అనుమతులు రాలేదు. కాగా ఈ అంశంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌తో మాట్లాడగా సీటీవో ముగియడంతో డీసిల్టేషన్ ప్రక్రియ ఆగిపోయినట్లు చెప్పారు. సీటీవో గడువు పొడగించాలని పర్యావరణ శాఖకు కలెక్టర్ లేఖ రాసినట్లు ఆయన వివరించారు.

అమ్మో.. ఏమిటా శబ్దం!

భారీ పేలుళ్లతో ఉలికిపడ్డ కావలి వాసులు

ఫైర్, పోలీసులకు సమాచారం

ఆయిల్ నిక్షేపాల కోసమేనని తేల్చడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు

కావలి పట్టణం. ఆదివారం మధ్యాహ్నం సరిగ్గా 2.35-40 గంటల ప్రాంతం. ఉన్నట్టుండి భూమి కంపిస్తున్నట్టు భారీ శబ్దం. అంతే... ఏదో జరగబోతోందని గ్రహించిన ప్రజలు అంతా ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక దళానికి సమాచారం అందజేశారు. వెంటనే ముసునూరుకు చేరుకున్న పోలీసులు అక్కడ జరుగుతున్న పనులు చూసి, ఏమీలేదంటూ చెప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే..



భూమికి రంధ్రాలు వేస్తున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ అన్వేషణ్' కార్యక్రమంలో భాగంగా ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) సంస్థ సిబ్బంది కావలిలోని ముసునూరు వద్ద పొలాల్లో ఆదివారం బోర్లతో డ్రిల్ వేసి బ్లాస్టింగ్ చేశారు. దీంతో మధ్యాహ్నం 2.40, 3.20, 4.00 గంటల ప్రాంతంలో 14 సార్లు భారీ శబ్దాలు రావడంతో భూకంపం వస్తుందన్న భయంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారుల నుంచి ముందస్తు సమాచారం లేకపోవటంతో భూమిలో వింత శబ్దాలు వస్తున్నాయంటూ అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు రూరల్ పోలీసు లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ ఆఫీసర్ శ్రీనాథ్‌రెడ్డి ఫైరింజన్, సిబ్బందితోను, రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్ఐ తిరుమల రెడ్డి, పోలీస్ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కావలి ప్రాంతంలో సుమారు 500 మంది ఓఎన్‌జీసీ సిబ్బంది డీజిల్, పెట్రోల్, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నట్లు ఆ సంస్థ సిబ్బంది ద్వారా సీఐ తెలుసుకున్నారు. బోర్ యంత్రాలతో డ్రిల్ వేసి ఆ రంధ్రాలలో డైనమిక్ పెట్టి పేల్చడంతో ఏర్పడే వైబ్రేషన్‌తో నిక్షేపాల అన్వేషణ డేటా స్వీకరిస్తున్నట్లు ఆ ప్రాంత వాసులకు తెలపటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

30 రోజులు 31.99 లక్షల మంది



● 'స్త్రీ శక్తి'కి మహిళాలోకం జేజేలు
● రూ.14.29 కోట్ల ఖర్చు
● బస్సుల్లో 12 శాతం పెరిగిన ఓఆర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :సూర్ సిక్స్ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీశక్తి పథకానికి మహిళాలోకం జేజేలు కొడుతోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించి నేటితో నెల రోజులు పూర్తవుతుంది. ప్రధానంగా పల్లె ప్రాంతాల్లోని మహిళలు, రోజూ ప్రయాణించే ఉద్యోగినులు, చిరువ్యాపారులు, విద్యార్థినులు లబ్ధి పొందుతున్నారు పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో గతంలో 68 శాతం ఓఆర్ వస్తుండగా ఉచిత ప్రయాణాలతో 80 శాతం ఓఆర్‌కు పెరిగింది. నెల రోజుల్లో 3,19,9612 మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించగా, రూ.14,29,06,064 లబ్ధి చేకూరింది. ఈ ఖర్చు ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది.

నెల రోజుల్లో ఉచిత బస్సు ప్రయాణాలు

డిపో	బస్సులు	ప్రయాణికులు	ఖర్చు (రూ.లలో)
ఆత్మకూరు	57	3,62,166	1,74,20,750
కందుకూరు	59	5,74,845	1,78,67,238
కావలి	81	6,16,983	2,59,85,470
నెల్లూరు-1	88	5,37,925	2,86,96,287
నెల్లూరు-2	76	5,70,640	2,09,63,900
రాపూరు	44	2,97,414	1,55,65,030
ఉదయగిరి	43	2,39,639	1,64,07,389
మొత్తం	448	3,19,9612	14,29,06,064

ఇటీవల కాలంలో పశువులకు వ్యాప్తి చెందుతున్న వ్యాధులతో పాడిరైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గాలికుంటు వ్యాధి కూడా ఒకటి. ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తించకపోతే పాల ఉత్పత్తి తగ్గిపోవడమే గాక పశువుల మరణాలు కూడా సంభవిస్తున్నాయి. దీని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం చేపడుతోంది. ఇంటి వద్దకే పశువైద్యులు వచ్చి టీకాలు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. 'గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయిద్దాం.. పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సాగనున్న ఈ కార్యక్రమం జిల్లాలో సోమవారం నుంచి నెలరోజులపాటు జరుగుతుంది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

గాలికుంటు వ్యాధి.. టీకాలతోనే నివారణ

● ఆరంభంలోనే గుర్తించకుంటే నష్టమే!
● నేటినుంచి నెలరోజులపాటు టీకాల పంపిణీ
● జిల్లాకు 5,18,000 డోస్‌ల కేటాయింపు

పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణకు నెలరోజులపాటు ఉచితంగా టీకాలు వేయనున్నారు. జిల్లాలో దాదాపుగా 6,46,088 నల్ల పశువులు, 57774 తెల్ల పశువులు ఉన్నట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 4నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీనికి సంబంధించి జిల్లాకు దాదాపుగా 5,18,000 టీకాల డోసులు జిల్లాకు రావడం, వీటిని నెల్లూరు, కందుకూరు, కావలి డివిజన్లకు కేటాయించడం జరిగిపోయింది. ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో ఎన్ని పశువులు ఉన్నాయనే వివరాల మేరకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ఇద్దరు, ముగ్గురు సభ్యులుగా బృందాలను ఏర్పాటు చేసి పశువులకు ఈ గాలికుంటువ్యాధి నివారణటీకాల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు.

● **వ్యాధి లక్షణాలు..**

కలుషితమైన గాలి, నీరు,





మేత ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి తీగల మాదిరి చొంగ కారుతూ ఉంటుంది. తీవ్రమైన జ్వరం ఉంటుంది. నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం చేస్తాయి. చూడి పశువులు ఈసుకుపోతాయి. వ్యాధి సోకిన పశువు ద్వారా ఇతర పశువులకు సంక్రమించే అవకాశం ఎక్కువ. పాలుతాగే దూడల్లో మరణాలు సంభవిస్తాయి. అంతేగాక పాల దిగుబడిలో దాదాపు సగం తగ్గిపోతుంది. నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయి. చికిత్స చేయించి, కోలుకున్న పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. పైగా మేత మేయడంలో మాత్రం ఎ లాంటి మార్పు ఉండదు. దీంతో రైతు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ వ్యాధి నివారణకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద నిరోధక టీకాల కార్యక్రమం చేపడుతోంది. ముందస్తు జాగ్రత్తగా ఈ టీకాలు వే యించుకోవడం వల్ల పాడిపశువుల్లో వ్యాధిని నిరోధించడం జరుగుతుంది. పాల ఉత్పత్తి తగ్గకుండా క్రమబద్ధీకరించవచ్చు. అదేవిధంగా మగ పశువుల్లో పని సామర్థ్యం తగ్గకుండా కాపాడుకోవచ్చు.

వ్యాధిని నివారించడమే లక్ష్యం



దేశవ్యాప్తంగా గాలికుంటువ్యాధిని పూర్తిగా నివారించడమే ఈ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ వ్యాధితో ఒక్క దూడ, పశువు చనిపోకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఉచితంగా టీకాలను పంపిణీ చేస్తున్నాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది పాడి రైతు ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ రమేష్‌నాయక్, జేడీ, పశుసంవర్ధక శాఖ

డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ

తుది ఎంపిక జాబితా నేడు విడుదల ● 19న నియామక పత్రాల పంపిణీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీకి సంబంధించి పరీక్షలు పూర్తి చేసి ప్రాథమిక, తుది కీల విడుదల, మెరిట్ జాబితాల పరిశీలన కూడా పూర్తి కావడంతో సోమవారం తుది ఎంపిక జాబితాలను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల్లో ఆనందం, ఉత్సాహంతోపాటు ఉత్కంఠ కూడా నెలకొంది. జిల్లావ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీకి సంబంధించిన నియామక ప్రక్రియలో ఇప్పటికే సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్‌ను వివిధ దశల్లో పూర్తి చేశారు. జూన్ 2 నుంచి నెలరోజులపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 31,221 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని హాజరయ్యారు. మెరిట్ జాబితా విడుదల, ధ్రువపత్రాల పరిశీలన కూడా పూర్తవడంతో ఇక తుది ఎంపిక జాబితాను విడుదల చేసి ఎంపికైనవారికి నియామక పత్రాలను అందించడం కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● **నియామక ఉత్తర్వులకు సన్నాహాలు**

విజయవాడలో 19న సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితోపాటు మరొకరు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. అభ్యర్థులంతా 18న సాయంత్రం నుంచి 19వ తేదీ వరకు బస చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు జిల్లాలో పదిరోజులపాటు శిక్షణ అందించి పాఠశాలలను కేటాయించనున్నారు.

నేడు కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు 75 కేజీలు, బాలికలకు 65 కేజీల విభాగంలో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2006 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన వారు విజయవాడలోని గొల్లపూడిలో ఈనెల 22 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

పక్కా ప్రణాళికతో జలాశయాల్లో నీటి నిల్వ

● రానున్న రోజుల్లో సాగుకు ఇబ్బందులుండవ్! ● సోమశిలలో రాష్ట్ర మంత్రి ఆనం ● డ్యాం నుంచి నీటి విడుదల

అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల, కండలేరు జలాశయాల్లో పక్కాప్రణాళికతో నీటినిల్వ చేశామని, రాబోవు రోజుల్లో నీటి ఇబ్బందులు లేకుండా దృష్టి సారించినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో సోమశిలలో నీటినిల్వ 74 టీఎంసీలకు చేరుకుంది. దీంతో ఆదివారం డ్యాంలోని 5, 6 గేట్లు ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువ పెన్నా నదికి విడుదల చేశారు. ముందుగా కంట్రోల్ రూం వద్దకు చేరుకున్న మంత్రి ఆనం స్విచ్ఛాన్ చేసి గేట్లు ఎత్తారు. జలహారతి ఇచ్చి నీరు విడుదల చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆనం మాట్లాడుతూ శ్రీశైలంకు ఎగువ నుంచి వచ్చిన వరదతో పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ జిల్లాలకు నీటి లభ్యత చేకూరిందని, అందులో భాగంగా వచ్చే నీటిని ప్రణాళికంగా సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకోగలిగామని చెప్పారు. ప్రాజెక్టు ప్రాధాన్యత క్రమంలో 74 టీఎంసీలు నిలుపుదల చేసి ఇక వచ్చిన జలాలను వచ్చినట్లు దిగువకు విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 5.60 లక్షల ఎకరాల్లో రెండవ పంటకు నీరు ఇచ్చామని, ఉన్న జలాలతో రాబోవు రోజుల్లో నీటి ఇబ్బందులు ఉండవన్నారు. వచ్చే నెల నుంచి పెన్నాక్యాచ్ మెంట్ ఏరియాలో వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంజనీర్లను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఆర్డీవో పావని, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, నీటి విడుదలను సాయంత్రానికి 10,030 క్యూసెక్కులకు పెంచారు.



సోమశిల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న జలాలు

● **సోమశిలకు పెరిగిన వరద**

సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద పెరిగింది. ఆదివారం 32,971 క్యూసెక్కులు కొనసాగగా, డ్యాంలో 74.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న మంత్రి ఆనం

కరేడు రైతులతో కలిసి ఆమరణ దీక్ష చేస్తా!

● **బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్**

ఉలవపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ కంపెనీకి విలువైన భూములను దోచిపెట్టే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోపోతే కరేడు రైతులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడె రమాచంద్ర యాదవ్ స్పష్టం చేశారు. ఉలవపాడు మండలం కరేడులో రైతులు చేపట్టిన భూసేకరణ పోరాటానికి మద్దతుగా ఆదివారం ఆయన కరేడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలైనా ఇచ్చి కరేడు రైతులకు చెందిన ఒక్క సెంటు భూమికూడా ఇండోసోల్ కంపెనీకి చెందకుండా చేసే బాధ్యత తాను తీసుకుంటానని మరోసారి భరోసా కల్పించేలా మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కరేడు రైతుల మనోభావాలను గౌరవించి ఇచ్చిన జీవోని వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించి భూసేకరణకే మొగ్గు చూపితే ఉద్యమం మరోరూపం దాల్చి యావత్తు రైతాంగం ఆమరణ దీక్షకు పూనుకుంటే తానూ దీక్ష చేపడతానన్నారు. అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాలు భూములు తీసుకుంటున్న ప్రభుత్వం ఒక్కరికైనా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన దాఖలాలు లేవని, రేపటి రోజున కరేడు రైతుల పరిస్థితి అదేగతి పడుతుందని అన్నారు.



కరేడు గ్రామసభలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10496
వెండి కిలో ధర	రూ. 132300
వెండి ఒక గ్రాము	రూ.135.30

వరి పైరు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బిట్రగుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరిపంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శైలజ తెలిపారు. ఆదివారం ఆమె బోగోలు, చెంచులక్ష్మీపురం, తాళ్లూరు గ్రామాల్లో పర్యటించి వరిపైరును పరిశీలించారు. పంటపొలాల్లో వర్షపు నీరు గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నేలకొరిగిన వరిని పైకి లేపి మూడు దుబ్బులుగా కలిపి కట్టాలన్నారు. నిల్వ ఉన్న వర్షపు నీరు బయటకు వెళ్లేలా కాలువలు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పౌలు, వీఏఏ హరిణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని బసిరెడ్డిపాలెం రూ.14.67 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గుడ్లూరు పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి విద్యుత్ కేంద్రం వరకు రోడ్డుకు ఒక వైపున రూ.25 లక్షలతో నిర్మించనున్న పెద్దసైడుకాలువ పనులకు భూమి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయభాస్కర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు చెన్నారెడ్డి మహేష్, గుడ్లూరు 1 ఎంపీటీసీ చెన్నారెడ్డి వరమ్మ, ఉన్నం వెంకటేశ్వర్లు, దామా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి టెన్నిస్ పోటీలు



బహుమతులందుకుంటున్న టెన్నిస్ విజేతలు

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణ జేబీ, విట్స్ కళాశా లలలోని టెన్నిస్ క్రీడా ప్రాంగణాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉ మ్మడి నెల్లూరు జిల్లాస్థాయి పులివర్తి రాఘవనాయుడు మెమోరియ ల్ డబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. 40 ఏళ్ల లోపు విభాగంలో మణికంఠ, జగదీష్ జట్టు విన్నర్స్‌గా దొడ్ల లిఖిత్ రెడ్డి, గిరి జట్టు రన్నర్స్‌గా నిలిచారు. 40 ఏళ్ల పైబడిన విభాగంలో నెల్లూరుకు చెందిన నికేష్, నితిన్ జట్టు విన్నర్స్‌గా శ్రీనివాసులు రెడ్డి, రాంబాబు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. 50 ఏళ్ల పైబడిన వెటరన్స్ విభాగంలో ప్రసాద్ రెడ్డి, వంశీ జట్టు విన్నర్స్‌గా, నెల్లూరుకు చెందిన శివకుమార్ రెడ్డి, చక్రి జట్టు రన్నర్స్‌గా నిలిచారు. ఆర్గనైజర్ పులివర్తి భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దొడ్ల లిఖిత్‌రెడ్డి పాల్గొని బహుమతులు అందించారు. సీనియర్ క్రీడాకారుడు అనుమాల శెట్టి రామకృష్ణ విజేతలను అభినందించారు.

యూటీఎఫ్ రణభేరిని జయప్రదం చేయండి

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం, బకాయిల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్యం చేయటమే లక్ష్యంగా యూటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రణభేరి యాత్ర ఈనెల 18న కందుకూరు చేరుకుంటుందని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రను ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రమాదకరంగా ఆర్వోబీ!

● ట్రాక్టర్ ఢీకొని దెబ్బతిన్న రైలింగ్ గోడ ● పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్ ఢీకొని ధ్వంసమైన వంతెన రైలింగ్ గోడ

కావలి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ నడిబొడ్డున ఉదయగిరి మార్గంలో నిర్మించి ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి వంతెన రైలింగ్ గోడ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల దసరా ఉత్సవాలు సందర్భంగా ఆర్వోబీ వంతెనపై వినాయక విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేయటానికి తీసుకెళుతున్న జలదంకి మండలంకు చెందిన ఒక ట్రాక్టర్ అదుపు తప్పి రైలింగ్ గోడను ఢీకొంది. అయితే ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తం కావటంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ ఇక ఒక ఇంచె ముందుకు కదిలి ఉన్నా ట్రాక్టర్‌లో ఉన్న ప్రజలతో పాటు వంతెన కింద అప్రోచ్ రోడ్డులో వెళ్లుతున్న ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ప్రాణాలుకోల్పోయేంత ప్రమాదం జరిగేది. వంతెనపై ఉన్న ఫుట్‌పాత్ గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో ట్రాక్టర్ ఫుట్‌పాత్ ఎక్కి దాని రైలింగ్ గోడను ఢీకొంది. ఈ సంఘటన జరిగి పక్షం రోజులు దాటినా అక్కడ ప్రమాదాలు జరుగకుండా జాతీయ రహదారి అధికారులు కానీ, స్థానిక అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వంతెనపై నడిచి వెళ్లే పాదాచారులు ఆదమరిస్తే వంతెన రైలింగ్ గోడలేని ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనికి తోడు వంతెన రోడ్డు స్పాన్ల మధ్య దెబ్బతిన్న అధికారులు మరమ్మతులు చేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నందున కొందరు ద్విచక్రవాహన చోదకులు ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగిస్తుండటంతో పడిపోయిన రైలింగ్ గోడ వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అలాగే వంతెన రైలింగ్‌ను ఢీకొట్టిన ప్రాంతంలో వాటి శిథిలాలు కిందికి వేలాడుతుండటంతో అప్రోచ్‌రోడ్డులో రాకపోకలు సాగించే వారు ఎక్కడ ఆ శిథిలాలు తమపైన పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వంతెన రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న అధికారులు వెంటనే రైలింగ్ గోడ పడిపోయిన ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అప్పటి వరకు అక్కడ తాత్కాలికంగా ఏదైనా నిర్మాణాలు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా వేలాడుతున్న వంతెన గోడ శిథిలాలు

పోలీసు ఆంక్షలను ధిక్కరించి

కదిలిన కరేడు రైతులు

● హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘన



కందుకూరు సీఐ, ఉలవపాడు ఎస్ఐలతో రైతుల వాగ్వాదం

కందుకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరేడులో బోడే రామచంద్ర యాదవ్ నిర్వహించిన సభకు రైతులు, రైతుకూలీలు పోటెత్తారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని కరేడు గ్రామస్థులు పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటించి తరలివచ్చారు. తమ గ్రామంలో తాము తిరిగేందుకు మీ ఆంక్షలేంటి అంటూ గ్రామస్థులు పోలీసులపై విరుచుకుపడటం, ఉప్పరపాలెంకు చెందిన ఓ రైతు నేను రాసిస్తా న న్ను కాల్చేయండి అంటూ కందుకూరు సీఐ అన్వర్‌బాషాతో వాగ్వాదానికి దిగటంతో ప్రజల్ని కంట్రోల్ చేయలేక పోలీసులు చేతులెత్తేశారు. దీంతో రామచంద్రయాదవ్‌తో గ్రామంలో ర్యాలీ జరిపారు. గ్రా మంలో రైతులతో సమావేశం నిర్వహణకు రామచంద్రయాదవ్ హైకోర్టును ఆశ్రయించగా ఈనెల 14న కరేడులో రైతులతో సమావేశం నిర్వహణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. అయితే 14న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు మాత్రమే సమావేశం జరుపుకోవాలని సమావేశంలో 100మందికి మించి ఉండకూడదని ఆంక్షలు పెట్టింది. ఈ మేరకు గట్టి బందోబస్తు తో చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖకు కూడా హైకోర్టు సూచన చేసింది. దీంతో కందుకూరు డీఎ స్పీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురం గిరిజనకాలనీ, ఉప్పరపాలెం ప్రజలు పోలీసులను పొ లాల్లో పరుగులు పెట్టించారు. గ్రామంలోకి రాకుండా పోలీసులు అడ్డగిస్తుండటంతో పోలీసులు పొలాల్లో పరుగులు తీయకతప్పలేదు.

● పోలీసుల ముందస్తు చర్యలు సఫలం

ఉదయగిరి : వరికుంటపాడు మండలం జంగంరెడ్డిపల్లి, ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామాల్లో ఆదివారం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ పర్యటన శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న నేపథ్యంలో పోలీసులు ముందుస్తుగా చేపట్టిన చర్యలు సఫలమయ్యాయి. కరేడు పర్యటన అనంతరం ఆయన సమస్యాత్మకంగా ఉన్న జంగంరెడ్డిపల్లి, అప్పసముద్రం గ్రామాల్లో సైతం పర్యటించి బాధితులను పరామర్శించనున్నట్లు ప్రకటించారు. అయితే ఆయా గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందన్న నేపథ్యంలో పోలీసు అధికారులు ముందస్తుగా సెక్షన్ 30, 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కరేడు సభ అనంత రం ఉదయగిరి సీఐ ఎస్.వెంకటరావు తన సిబ్బందితో రామచంద్రయాదవ్‌తో చర్చించి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

చీకటి చట్టాలపై పోరాడకుంటే తీవ్రనష్టం

● ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అయ్యపరెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలలో కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న చీకటి చట్టాలపై కార్మికులు ఉద్యమం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి పిలుపునిచ్చారు. కందుకూరు ఆర్టీసీ డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ మూడవ మహాసభ ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ చట్టాలపై ప్రారంభంలోనే ఉద్యమించకపోతే భవిష్యత్తులో కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కోక తప్పదన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా డీ.మాలకొండయ్య, కార్యదర్శిగా డీ.రమణయ్య, కోశాధికారిగా ఎస్‌కె సబ్జానీ, 11మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, ఏ.కృష్ణయ్య, ఎస్కే ఖాజావలి, డీ.మల్లికార్జునరావు, కె.నాగేంద్రరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, జీ.శీనయ్య, దేవరపల్లి రమణయ్య, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన



కరపత్రాలు ప్రదర్శిస్తున్న జేవీవీ సభ్యులు

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం బీపీఎస్ సెంటర్‌లో వ్యాధులకు కారణమైన దోమల నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, సుబ్బరాయశర్మ, నారాయణ, ఖాదర్‌బాషా, ఎస్ వెంకయ్య, కల్లయ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కందుకూరు/వలేటివారిపాలెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు నెలరోజులపాటు టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశువైద్య శాఖ కందుకూరు ఏడీ డాక్టరు జే.చంద్రమోహన్, వలేటివారిపాలెం వెటర్నరీ ఏడీ ఎంతోటి చెన్నకేశవులు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆయా మండలాల్లో ఈనెల 15 నుంచి అక్టోబరు 15వరకు జరుగుతుందని తెలిపారు.

గూడ్సు రైలు గార్డుకు తీవ్రగాయాలు

బిట్రగుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు ఎగువ మార్గంలో ఆదివారం గూడ్సు రైలు బోగీలు మార్చుకునే సమయంలో పనులను పర్యవేక్షిస్తున్న గూడ్సు రైలు గార్డు డీ.వెంకట్రామిరెడ్డికి ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలయ్యాయి. ఆయ నను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు.

జాతీయ సాంకేతిక సదస్సు

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల విశ్వోత్సవ్ 2025 ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవం సభలో విశ్వోదయ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ సాంకేతిక సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండోసోల్ సంస్థ మేనేజర్ ఎస్‌వీవీ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్లు లిఖిత్ రెడ్డి, ప్రత్యూషారెడ్డి, డాక్టర్ సునీల్ కు మార్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆదివారాహి యాగం

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదివారాహి అమ్మవారి విశిష్టత చాటేందుకు దేశ వ్యాప్తంగా వారాహి మహా రథ యాత్ర నిర్వహిస్తున్నామని తిరుచానూరులోని ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్, వారాహి సేవా సైన్యం ట్రస్ట్‌ల అధ్యక్షుడు మహారుద్ర వారాహి స్వామి పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌ఆర్ పార్కులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం రుద్రకోట అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న వారాహి యాగంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వార్డెన్ మల్లేశ్వరి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి, అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కష్టపడి చదివాలని విద్యార్థినులకు సూచించారు.

గురుకులంలో వైద్యశిబిరం

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో జ్వరాల బారినపడి పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక వైద్యాధికారులు బాలికలకు వైద్యరీక్షలు నిర్వహించి తగిన చర్యలు చేపడుతున్నారు. ఆదివారం మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. అస్వస్థతకు గురై ఆత్మకూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడడంతో వారిని తిరిగి గురుకుల పాఠశాలకు చేర్చారు. జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న బలభద్ర ఆనందరావుకు ఆదివారం ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. తన ప్రతినిధుల ద్వారా ఆ నగదును కుటుంబ సభ్యులకు అందించి పరామర్శించారు. బాధితుడి సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి మరింత ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఇమ్రాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదాన, వైద్య శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, మొక్కలు నాటడం వంటివి చేపడుతామన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలి : డీబీసీడబ్ల్యూవో

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో చదివే 10వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు ఇప్పటి నుంచే వసతి గృహాల సంక్షేమాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారిణి (డీబీసీడబ్ల్యూవో) పి వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌డబ్ల్యూవోలు వసతి గృహాల్లో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవోపి కృష్ణయ్య, పలువురు వసతిగృహాల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



బాలికలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ

సోమశిల.. 'సాంకేతిక' మకుటం!



అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలక మైనది. దశాబ్దాల క్రితం నిర్మించిన పలు జలాశయాలు, వంతెనలు, మార్గాలు.. వారి మేధోశక్తికి అద్దం పడతాయి. ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) సందర్భంగా సోమశిల జలాశయ అద్భుత నిర్మాణం పై ప్రత్యేక కథనం.

సోమశిల జలాశయం అప్పటి ఇంజనీర్ల ప్రతిభకు దర్పణం పడుతోం ది. పెన్నానది నుంచి జలాలు వృథా గా సముద్రంలో కలుస్తుండగా, వాటి ని ఒడిసిపట్టి రైతులకు మేలు చేకూ ర్చేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించా రు. దీంతో సాగు, తాగునీటి అవసరా లు తీరి నేడు ప్రజలు సుభిక్షంగా జీవనం సాగిస్తున్నారు. సోమశిల ప్రాజెక్టుకు 1975లో శంకుస్థాపన చేశారు. 10 ఏళ్లలో ఒక దశ పను లు పూర్తయ్యాయి. రెండు కొండల మధ్య ఈ ప్రాజెక్టు నిర్మించారు. కొండల అంచులు అడ్డంకిగా ఉండే వాటిని తొలగించే ప్రక్రియలో ఇంజనీర్లు, శ్రామికులు పడ్డ కష్టాలను నేటికీ స్థానికులు చర్చించుకుం టుండడం విశేషం. ఈ ప్రాజెక్టు తొలుత 16 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా డిజైన్ చేశా రు. ఆ తర్వాత 32 టీఎంసీలకు.. నేడు అన్నీ అడ్డంకు లు అధిగమించి 78 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా డెల్టా, నాన్‌డెల్టాకు రెండు పంటలకు సాగు జలాలు అందించడంతో పాటు పొరుగు రాష్ట్ర మైన చైన్నైకి కూడా తాగు నీరు ఇస్తున్న జల నిధిగా మారింది. ఆనాటి ఇంజనీర్ల ప్రతిభతో నేటికీ ప్రాజెక్టు నిర్మాణం చెక్కుచెదరలేదు. నీటిలభ్యత పుష్కలం కావడంతో జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.

● ప్రాజెక్టు నిర్మాణంలో ఎర్త్‌డ్యాం, డౌన్‌స్టేం, క్రస్ట్‌గేట్ల అమరిక, ప్రొటెక్షన్‌వాల్స్, స్పిల్‌వే, గ్యాలరీ నిర్మాణాలు అద్భుతంగా డిజైనింగ్ చేసి నిర్మించారు. ఇవి నాటి ఇంజనీర్ల సాంకేతిక ప్రతిభకు అద్దం పడుతున్నాయి.

వండర్ డ్యాం కండలేరు

రాపూరు : బహుళార్థసాధక ప్రాజెక్టుగా ఖ్యాతి గడించిన కండలేరు జలాశయం మానవ శ్రమకు సంకేతం. ఈ ప్రాజెక్టు నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడులోని చెన్నై వాసుల జలప్రసాది నిగా నిలుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం అంతంతగా నే ఉన్న రోజుల్లో ఆనాటి సివిల్ ఇంజనీరింగ్ అద్భు తాలతో ఈ డ్యాంను నిర్మించారు. వేలాదిమంది కూ లీలు, రకరకాల యంత్రాలతో, ఇంజనీరింగ్ నిపుణు ల పర్యవేక్షణలో స్థానిక సాంకేతిక నిపుణులు, అధికారులు, సిబ్బంది రేయింబవళ్ల శ్రమించి ఈ అద్భు త నిర్మాణాన్ని పూర్తి చేశారు. రాపూరు మండలం చెల్లటూరు గ్రామం వద్ద పెంచలకోన నుంచి వచ్చే కండలేరు వాగుపై నిర్మించిన ఈ డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు. వండర్ డ్యాంగా రికార్డులకెక్కిన ఈ కండలేరు ఆసియా ఖండంలోనే ఎక్కడా లేని విధంగా 11. కిమీ పొడవు, 49 మీటర్ల ఎత్తుతో నీటి అలలను తట్టుకునేలా వంకర్లు తిరిగే విధంగా మట్టి కట్టను నిర్మించారు. ఇందుకోసం 161 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని వినియోగించారు. జిల్లాకు చెందిన కూలీలతోపాటు రాష్ట్ర నలుమూలలకు చెందిన శ్రామికులు పనుల్లో భాగస్వాములయ్యారు. అప్పటి ప్ర భుత్వ ఓఎస్‌డీ, తెలుగు గంగ రూపకర్త రామకృష్ణయ్య సారథ్యంలోనే డ్యాం నిర్మాణ పనులు ప్రారం భించారు. తొలి ఎస్ఈగా కృష్ణమూర్తి, ఈఈగా వెం కట నరసయ్య పనిచేశారు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో 3 లక్షల ఎకరాలకు సాగు నీరు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అంది స్తోంది తమిళనాడులోని చెన్నై నగరవాసులకు ఏడాదికి 15 టీఎంసీల నీటిని అం దిస్తోంది. అంతేకాక హెడ్‌రెగ్యులేటర్ వద్ద 9 మెగా వాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్నా తాజాగా 6 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

మోటారు బైక్ బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, రాజువారి చింతలపాలెం మధ్యన ఆదివారం రాత్రి మోటారు బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజువారి చింతలపాలెంకు చెందిన కత్తి బుజ్జిబాబు, పెళ్లకూరు రవికి తీవ్రగాయాలయ్యాయి. వీరు కొత్తపల్లి నుంచి స్వగ్రామం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.



